ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు

సోమవారం 7 జూలై 2025



- అట్టహాసంగా రొట్టెల పండుగ ప్రారంభం
- తొలిరోజే భక్తజనంతో కిక్కిరిసిన దర్గా ప్రాంగణం
- సంప్రదాయబద్ధంగా సందల్‌మాల్
- ఏర్పాట్లు పర్యవేక్షించిన జిల్లా యంత్రాంగం

నేటి అర్ధరాత్రి గంధ మహోత్సవం

సమగ్ర కథనం 8లో..





దర్గాలో సమాధులను దర్శించుకుంటున్న భక్తులు





ఆధ్యాత్మిక శోభ

కోరికల పండగ కోసం తరలివచ్చిన యాత్రికులతో నెల్లూరు నగరం కిక్కిరిసిపోయింది. ప్రధాన కూడళ్లే కాదు.. బారాషహీద్ దర్గాకు వెళ్లే అన్ని వీధులు భక్తుల రాకపోకలతో సందడిగా మారాయి. మతసామరస్యానికి ప్రతీకగా జరిగే రొట్టెల పండుగ ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. వరాల రొట్టెను అందుకునేందుకు భక్తజనం తరలిరావడంతో తొలిరోజే బారాషహీద్ దర్గా ప్రాంగణం కిక్కిరిసి పోయింది. స్వర్ణాల ఘాట్ వద్ద కోరికలు తీరిన భక్తులు మళ్లీ వచ్చి తమ రొట్టెలు వదిలి, కొత్త కోరికల రొట్టెలను అందుకున్నారు. వివాహం, సంతానం, సౌభాగ్యం, ఆరోగ్యం, ఉద్యోగం, ప్రమోషన్, గృహం, విదేశీయానం, విద్య వంటి రొట్టెలకు తొలిరోజు డిమాండ్ ఏర్పడింది. విద్య, ఉద్యోగం, రొట్టెల కోసం యువతీ యువకులు ఎగబడ్డారు. ఆదివారం అర్ధరాత్రి సందల్‌మాల్ భక్తిశ్రద్ధలతో మత పెద్దలు, ముస్లిం నేతలు ప్రజాప్రతినిధులు, పోలీసు బందోబస్తు మధ్య ఘనంగా జరిగింది. అర్ధరాత్రి దాటిన తర్వాత బారాషహీదుల సమాధులను శుభ్రం చేసి ముస్లిం మత పెద్దలు సంప్రదాయబద్ధంగా పూజలు, ప్రార్థనలు చేసి సమాధులకు గంధ లేపనం చేసి కొత్త గలేఫ్‌ను కప్పారు. పండుగలో ప్రధాన ఘట్టమైన గంధమహోత్సవం సోమవారం అర్ధరాత్రి తర్వాత జరగనుంది. ఈ వేడుకల్లో రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, మహ్మద్ ఫరూక్, పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి తదితరులు పాల్గొన నున్నారు. భక్తులకు ఎలాంటి లోటుపాట్లు రానీయకుండా అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది. కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ ఇతర అధికారులతో కలిసి దర్గా ప్రాంగణాన్ని కలియతిరిగారు. ఘాట్‌లో మత్స్య శాఖ, అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖలు అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పర్యవేక్షించారు.



మాకూ కొంచెం రొట్టె ఇవ్వండి!



"అమాత్యా మా మొర ఆలకించు.. 'యువగళం' పేరిట జిల్లాలో పాదయాత్ర చేసిన మీకు అనేక సమస్యలు వివరించాము. మరీ ముఖ్యంగా నెల్లూరులో బీసీ భవన్ నిర్మాణం, కావలిలో 'అమృత్ పథకం' పైలాన్ ధ్వంసం, ఎన్టీఆర్ విగ్రహం తొలగింపు, భూ ఆక్రమణలు ఇలా అనేక సమస్యలు మీ దృష్టికి తెచ్చాము. అధికారంలోకి రాగానే అన్నిటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటిపోయింది. బీసీ భవన్ పునాదుల దశ దాటలేదు.. పైలాన్, విగ్రహాలను ధ్వంసం చేసినవారు కాలర్ ఎగరేసుకుని తిరుగుతున్నారు. మీరు ఇచ్చిన హామీలే ఇప్పటికీ నెరవేరలేదయ్యా'

- నెల్లూరులో తెలుగుదేశం పార్టీ శ్రేణుల ఆవేదన ఇది.



నెల్లూరు : పునాదుల దశలోనే ఉన్న బీసీ భవన్



అమాత్యా.. ఆలకించు!

- ఆరేళ్లుగా పునాదుల దశ దాటని బీసీ భవన్
- కావలిలో అమృత్ పైలాన్ ధ్వంసం
- నిందితులెవరో తెలిసినా చర్యలేవీ!?
- ఎన్టీఆర్ విగ్రహం పెకలించినా దిక్కులేదు!
- నెరవేరని 'యువగళం' హామీలు
- నెల్లూరులో నేడు నారా లోకేష్ పర్యటన
- మంత్రి నిర్ణయంపై టీడీపీ శ్రేణుల్లో ఉత్కంఠ

పునాదుల్లోనే బీసీ భవన్

నెల్లూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అధిక సంఖ్యలో ఉన్న బీసీల సంక్షేమం కోసం బీసీ భవన్ నిర్మాణానికి 2019లో టీడీపీ ప్రభుత్వం రూ.4.40 కోట్లు మంజూరు చేసింది. ఆ ఏడాది జనవరిలో కొండాయపాలెం గేటు వద్ద అప్పటి మంత్రులు కింజారపు అచ్చెన్నాయుడు, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నారాయణ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర శంకుస్థాపన చేశారు. ఈ భవన్‌లో కల్యాణ వేదికతోపాటు రూములు కూడా నిర్మించనున్నారు. బీసీలు తక్కువ ధరకు శుభకార్యాలు చేసుకోవడం ప్రధాన ఉద్దేశం. శంకుస్థాపన తర్వాత పునాదుల పనులు పూర్తయ్యాయి. ఈలోపు ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారడంతో బీసీ భవన్ పనులకు బ్రేకులు పడ్డాయి. టీడీపీ ప్రభుత్వం ఈ భవన నిర్మాణాన్ని మొదలుపెట్టిందన్న ఒకే ఒక కారణంతో ఆ తర్వాత పనులు నిలిపేశారు. బీసీల నుంచి వ్యతిరేకత రావడంతో 2022లో మరోమారు బీసీ భవన్‌కు తూతూమంత్రంగా శంకుస్థాపన చేసి వదిలేశారు. బీసీ సంఘాలు ఎన్నిసార్లు విన్నవించుకున్నా వైసీపీ ప్రభుత్వం కనికరించలేదు.

రూ.12 కోట్లతో ప్రతిపాదనలు

ఎన్నికలకు ముందు యువగళం పాదయాత్రలో నెల్లూరుకు వచ్చిన నారా లోకేష్ బీసీ భవన్ నిర్మాణానికి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ భవనాన్ని పూర్తి చేస్తామని ప్రకటించారు. చెప్పిన విధంగానే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక బీసీ భవన్‌కు కొత్తగా ఎస్టిమేషన్లు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. మొదట రూ.4.40 కోట్ల అంచనాలతో పనులు మొదలవగా ఇప్పుడు అవి సుమారు రూ.12 కోట్లకు చేరుకున్నాయి. ఈ ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరి కూడా ఆరు నెలలు దాటింది. కానీ ఇంత వరకూ అక్కడి నుంచి ఎటువంటి స్పందన లేదు. ప్రభుత్వ అనుమతులు కోసం జిల్లాలోని బీసీలంతా ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి నారా లోకేష్ సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. దీంతో ఆయన తన హామీని నిలబెట్టుకుంటూ బీసీ భవన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసేలా చొరవ తీసుకోవాలని బీసీలు కోరుతున్నారు.



2018, జనవరి 8న అప్పటి మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించిన శిలాఫలకం ఇది. కావలి పట్టణవాసుల దాహార్తి తీర్చేందు కోసం అమృత్ పథకం కింద కేంద్రం నిధులు మంజూరు చేసింది. ఆ మేరకు పట్టణ నడిబొడ్డున ట్రంకు రోడ్డు ఆనుకుని 'అమృత్' పైలాన్‌ను ఆవిష్కరించారు. ఆ తర్వాత రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రావటంతో కావలి ఎమ్మెల్యేగా ఉన్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పైలాన్ శిలాఫలకంపై వేసిన పేర్లలో ప్రోటోకాల్ పాటించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనూహ్యంగా 2020, ఏప్రిల్ 10వ తేదీ రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పైలాన్‌ను ధ్వంసం చేసి, స్థలాన్ని చదును చేశారు. ఆ పైలాన్ శిథిలాలను కావలి మందాటి చెరువులో గుర్తించారు. అప్పట్లో కేసు నమోదు చేసిన పోలీసులు ఆ తర్వాత ఆగంతకులు ఎవరో తెలియలేదంటూ కేసును క్లోజ్ చేశారు. ఈ వ్యవహారంపై అప్పట్లో యువగళం పాదయాత్రలో భాగంగా కావలికి వచ్చిన నారా లోకేష్‌కు టీడీపీ వర్గాలు ఫిర్యాదు చేశాయి. దానిపై చర్యలు తీసుకుంటామని అప్పట్లో హామీ ఇచ్చారు. అయితే, ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పైలాన్ కేసును రీఓపెన్ చేసి ఆ కేసులో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డితోపాటు కొందరు వైసీపీ నాయకులను అప్పట్లో వైసీపీతో అంటకాగిన కొందరు జర్నలిస్టులను కలిపి 12 మందిపై కేసు కట్టారు. అయితే ఈ కేసులో ఆరోపణల కింద వారిని అరెస్ట్ చేశారే తప్ప ఆధారాలతో సమగ్ర విచారణ జరపకుండా కాలయాపన చేస్తున్నారు.

ఎన్టీఆర్ విగ్రహం..

అలాగే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మునుసూరు మహాలక్ష్మమ్మ ఆలయం వద్ద ట్రంకు రోడ్డు వెంబడి ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని వైసీపీ నాయకులు పట్టపగలే ఎక్స్‌కవేటర్‌తో పెకలించి వేశారు. ఈ వ్యవహారంపై ఆధారాలతో సహా పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇక కావలి ప్రాంతంలో ప్రభుత్వ భూముల ఆక్రమణ వ్యవహారం అందరికీ తెలిసిందే. తాము అపూర్వ సహోదరులమని చెప్పుకునే ఇరువురు నేతలమీద అనేక ఆరోపణలు వచ్చినా చర్యలు తీసుకోవడం లేదు.

- కావలి, (ఆంధ్రజ్యోతి



కావలి : ఎన్టీఆర్ విగ్రహాన్ని పెకలిస్తున్న దృశ్యం (ఫైల్)

మహావిష్ణువుగా పెంచలోరు

- జిల్లావ్యాప్తంగా వైభవంగా తొలి ఏకాదశి



నెల్లూరు (సాంస్కృతికం) /రాపూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : హిందువుల తొలి పండుగ అయిన తొలి ఏకాదశిని ఆదివారం జిల్లావాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వైష్ణవ ఆలయాలతోపాటు అన్ని ఆలయాల్లో విశేష పూజలు, ప్రత్యేక అలంకారాలు, ఉత్సవాలు జరిగాయి. ఇంటింటా పూజలు, ఉపవాసాలు, పేలాలు, పిండివంటలతో ప్రజలు పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. నృసింహకొండ, తల్పగిరి రంగనాథస్వామి ఆలయం, కొండ బిట్రగుంట, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయాలతోపాటు జిల్లావ్యాప్తంగా అన్ని ఆలయాల్లో తిరుమంజనాలు, విశేష అలంకారాలు, విష్ణు సహస్ర నామ పూజలు, పారాయణాలు, పేట ఉత్సవాలు జరిగాయి. ఇక పెంచలకోనలో తొలి ఏకాదశిని భక్తిశ్రద్ధలతో మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య అర్చకులు ఎంతో ఆడంబరంగా నిర్వహించారు. పాలకడలిలో శేషపాన్పుపై మహావిష్ణువు శయనిస్తున్నట్లుగా లక్ష్మీనృసింహుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవర్లకు వివిధ రకాల ప్రత్యేక వంటకాలను తయారు చేయించి నైవేద్యంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏసీ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మెగా పీటీఎంకు విస్తృత ఏర్పాట్లు

నెల్లూరు(విద్య), జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను ఈ నెల 10వ తేదీన జిల్లాలో పెద్ద ఎత్తున నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈఓ డాక్టర్ ఆర్.బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల్లోని 3,555 పాఠశాలల్లో, 143 కళాశాలల్లో పీటీఎం నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రతి విద్యార్థి యూనిఫాం తప్పక ధరించాలని, తల్లిదండ్రులకు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థుల విద్యా ప్రమాణాలు, సాధించిన విజయాలను చర్చించి హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు అందచేసి నివేదికలు ఇస్తామన్నారు. సందేహాలుంటే జీసీడీఓ మమత, ఫోన్ నెం. 9908837107, ఐటీడీఏ ఏఎంఓ శాంతకుమారి, ఫోన్ నెం.9491539119, ఏపీఓ ప్రసాద్, ఫోన్ 7013025247 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

2,00,295 కుటుంబాలకు 'అన్నదాత సుఖీభవ'

నెల్లూరు(వ్యవసాయం), జూలై 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2,00,295 కుటుంబాలు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత పొందినట్లు జిల్లా వ్యవసాయాధికారి(డీఏవో) పీ సత్యవాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకానికి అర్హత పొందాలంటే ప్రతి రైతు తన భూమిని ఆధార్‌కి అనుసంధానించుకుని ఉండాలన్నారు. వివిధ కారణాలతో అర్హత పొందలేని రైతుల వివరాలను గ్రీవెన్స్ మాడ్యూల్‌లో పొందుపరచడం జరిగింది తెలిపారు. వారందరూ రైతు సేవా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులను కలిసి అందుకు గల కారణాలను తెలుసుకుని వాటిని సరిచేసుకనేందుకు ఈ నెల 10వతేదీ వరకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు సాగుచేసుకుంటున్న రైతులు ఈ పథకాలకు అర్హులుకారని స్పష్టం చేశారు. అదేవిధంగా అన్‌సెటిల్డ్ ఇనాం భూములు, రీసర్వే జరిగిన గ్రామాల్లో సర్వే కాని భూముల వివరాలను ప్రత్యేకంగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ద్వారా వ్యవసాయశాఖ కమిషనర్‌కు పంపాలని ప్రభుత్వ ఆదేశాలు వచ్చాయని తెలిపారు.



బారాషహీద్ దర్గాలో భక్తులు

'స్వర్ణాల' వేడుక..

- అట్టహాసంగా రొట్టెల పండుగ ప్రారంభం
- తొలిరోజే భక్తజనంతో కిక్కిరిసిన దర్గా ప్రాంగణం
- సంప్రదాయబద్ధంగా సందల్‌మాల్

కదిలింది ప్రజానీక!

- ఏర్పాట్లు పర్యవేక్షించిన జిల్లా యంత్రాంగం
- నేటి అర్ధరాత్రి గంధమహోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 6 (ఆంధ్రజ్యోతి) : దేశం నలుమూలల నుంచి తరలివస్తున్న భక్తులతో బారాషహీద్ దర్గా జనసంద్రమైంది. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన రొట్టెల పండుగ ఆదివారం ప్రారంభమైంది. తొలిరోజే భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండులతో పాటు సొంత వాహనాలలో భక్తులు తరలిరావడంతో దర్గా మైదానం, స్వర్ణాల చెరువు ఘాట్ కిక్కిరిసిపోయాయి. దాదాపు అర్ధ కి.మీ దూరం మేరకు భక్తులు బారులుతీరి బారాషహీదులను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో దువాలు చేస్తున్నారు. ఇక స్వర్ణాల ఘాట్ వద్ద కోరికలు తీరిన భక్తులు మళ్లీ వచ్చి తమ రొట్టెలు వదిలి, కొత్త కోరికల రొట్టెలను అందుకున్నారు. వివాహం, సంతానం, సౌభాగ్యం, ఆరోగ్యం, ఉద్యోగం, ప్రమోషన్, గృహం, విదేశీయానం, విద్య వంటి రొట్టెల కోసం భక్తులు ఎగబడ్డారు. ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు, ప్రమోషన్ల రొట్టెలను పట్టుకున్నారు. యువతీ యువకులు విద్య, ఉద్యోగం, రొట్టెల కోసం ఆరాటపడ్డారు. కొత్త జంటలు సంతాన రొట్టెల కోసం ఎంతో ప్రయాసపడి పట్టుకున్నారు. భక్తులకు స్నానాలు చేసేందుకు కార్పొరేషన్ షవర్లు ఏర్పాటు చేసింది. అత్యధిక శాతం మంది చెరువులో సరదాగా ఈతకొట్టి, సెల్ఫీలు తీసుకున్నారు. ఘాట్‌లో మత్స్యశాఖ, అగ్నిమాపకశాఖ, పోలీసు శాఖలు అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పర్యవేక్షించారు. బోట్ క్లబ్ వద్ద పర్యాటకాభివృద్ధి శాఖ ఏర్పాటు చేసిన జిల్లాలోని పర్యాటక ప్రాంతాల ఫొటో, వీడియో ఎగ్జిబిషన్లు ఆకట్టుకున్నాయి.

● భక్తిశ్రద్ధలతో సందల్‌మాల్



అన్నా నాకో రొట్టె ఇవ్వు! : స్వర్ణాల చెరువులో రొట్టె కోసం భక్తుల పోటీ

10వ తేదీ వరకు జరిగే రొట్టెల పండుగలో తొలిరోజు ఆదివారం అర్ధరాత్రి సందల్‌మాల్ భక్తిశ్రద్ధలతో మత పెద్దలు, ముస్లిం నేతలు ప్రజాప్రతినిధులు, పోలీసు బందోబస్తు మధ్య ఘనంగా జరిగింది. అర్ధరాత్రి దాటిన తర్వాత బారాషహీదుల దర్శనాన్ని ఆపారు. అగ్నిమాపక యంత్రాల ద్వారా బారాషహీదుల సమాధులను శుభ్రం చేసి ముస్లిం మత పెద్దలు సంప్రదాయబద్ధంగా పూజలు, ప్రార్థనలు చేసి సమాధులకు గంధ లేపనం చేసి కొత్త గలేఫ్‌ను కప్పారు. ఈ కార్యక్రమంకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

● నేడు గంధమహోత్సవం

రొట్టెల పండుగలో ప్రధాన ఘట్టమైన గంధ మహోత్సవం సోమవారం అర్ధరాత్రి తర్వాత జరగనుంది. ఈ వేడుకల్లో రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, మహ్మద్ ఫరూ క్, పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి తదితరులు పాల్గొననున్నారు. ఈ ఘట్ట ముగియగానే మంగళవారం రొట్టెలపండుగ జరగనుంది.

● ఉక్కపోతతో తల్లడిల్లిన భక్తులు

మధ్యాహ్నపూట భానుడి తీవ్రతకు భక్తులు ఇబ్బందిపడ్డారు. ఎండవేడిమికితోడు ఉక్కపోత ఎక్కువవడంతో పిల్లలు, వృద్ధులు అల్లాడిపోయారు. దర్గా లోపల పట్టలు వేయకపోవడంతో బారాషహీదుల దర్శనం కోసం క్యూలైన్లలో వేచిఉన్న భక్తులు అసౌకర్యానికి గురయ్యారు. బోట్ క్లబ్ వద్ద భారీ వృక్షాలు, స్వర్ణాల చెరువు అలల చల్లని గాలులతో భక్తులు సేద తీరారు. మైదానం లోపల ఉన్న రోడ్లకు రబ్బీస్ (ఇసుక) వాడటంతో దుమ్ము రేగింది. వెంటనే స్పందించిన కార్పొరేషన్ సిబ్బంది ట్యాంకులతో నీళ్లు చల్లారు. వైద్య సహాయం కోసం ఏర్పాటు చేసిన శిబిరాలలో ప్రభుత్వ అల్లోపతి, ఆయుర్వేద, హోమియో వైద్యులు రోగులను పరీక్షించి మందులు ఇచ్చారు. కాగా, ప్రైవేటు వైద్యశిబిరాల్లో కొన్నింటిలో వైద్యులు లేరు. మందులులేవు. కొన్నింటిలో అవసరమైన మందులు లేవు.

● అడుగడుగునా ట్రాఫిక్ జాం.

రొట్టెల పండక్కి భక్తజనం పోటెత్తడంతో నగరంలో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నగరంలోకి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర భారీ వాహనాలను దారి మళ్లించినా దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు, ఆటోలతో ప్రధాన రహదారులు రద్దీగా మారాయి.

100 మందితో రెడ్‌క్రాస్ సేవలు...



శిబిరంలో పాల్గొన్న రెడ్‌క్రాస్ స్వచ్ఛంద సేవకులు

నెల్లూరు (వైద్యం), జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ 100 మందితో రొట్టెల పండుగలో భక్తులకు సేవలు అందిస్తోంది. ఆదివారం ప్రథమ చికిత్స కేంద్రం, అంబులెన్స్ సర్వీసెస్, యూత్ రెడ్‌క్రాస్, విపత్తుల నివారణ విభాగాలు సేవలు ప్రారంభించాయి. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ పాలక మండలి సభ్యుడు దాసరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రొట్టెల పండుగ జరిగే ఐదు రోజులు సేవలు కొనసాగుతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మాజీ చైర్మన్ ఏవీ సుబ్రహ్మణ్యం, ఏవో చంద్రశేఖర్, జీజీహెచ్ దంత వైద్యుడు డాక్టర్ శ్రీకాంత్, జిల్లా పీఎంపీ అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, గౌస్‌బాషా, కన్యాకుమారి, స్వాతి, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

శభాష్.. పోలీస్ !

- తప్పిపోయినవారిని కుటుంబ సభ్యుల చెంతకు..
- కన్నీటితో కృతజ్ఞతలు



తప్పిపోయిన పిల్లవాడిని తల్లికి అప్పగించిన పోలీసులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బారాషాహిద్ దర్గాలో ఆదివారం ప్రారంభమైన రొట్టెల పం డుగకు అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యుల నుంచి చిన్నారులు తప్పిపోయి ఒంటరిగా భోరున విలపిస్తున్నారు. ఈ క్రమంలో మేమున్నా మంటూ పోలీసులు ముందుకు వచ్చి చిన్నారులను ఔట్‌పోస్టు వద్దకు తీసుకెళుతున్నారు. వారిని సముదాయించి, మంచినీరు తాపించి, తల్లిదండ్రుల పేర్లు, ప్రాంతం తెలుసుకొని మైక్‌లో అనౌన్స్ చేస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు అక్కడికి వచ్చి వారి పిల్లలను అక్కున చేర్చుకుంటు న్నారు. పోలీసులకు కన్నీటితో కృతజ్ఞతలు తెలుపుతున్నారు. తొలిరోజే వందల సంఖ్యల్లో పిల్లలు, వృద్ధులు, ఇతర వ్యక్తులు తప్పిపోగా, వారిని పోలీసులు కుటుంబసభ్యుల చెంతకు చేర్చారు.

సామాజిక మాధ్యమాల్లో చూసి వచ్చా...



నెల్లూరులో జరిగే రొట్టెల పండుగ గురించి సామాజిక మాధ్యమాల్లో చూశా. మా కుటుంబ సభ్యులు తప్పనిసరిగా రావాలని ఒత్తిడి చేయడంతో వచ్చా. ఇక్కడ కుల, మతాలతో సంబంధం లేకుండా అంతా కలిసి, రొట్టెలు మార్చుకోవడం ఎంతో వింతగా అనిపించింది. కుటుంబస భ్యులతో కలిసి ఉద్యోగం, ఆరోగ్యం, వ్యాపారం రొట్టెలను పట్టుకున్నా.

- మహమద్ ఆరీఫ్, బెంగుళూరు

పిల్లల కోసం కష్టమైనా వచ్చా..



మా బంధువులంతా ప్రతి ఏటా రొట్టెల పండుగకు వస్తుంటారు. రొట్టెలు పట్టుకొని కోరుకున్న కోరికలు నెరవేరాయని వారు చెబుతుంటే వినేవాడిని.ఎంత కష్టమైనా నా పిల్లల కోసం రొట్టెల పండుగకు వచ్చా. వారి కోసం చదువు రొట్టెను పట్టుకున్నా. ఇక్కడ వారి నమ్మకం చూస్తుంటే కచ్చితంగా కోర్కెలు నెరవేరుతాయన్న బావన కలిగింది.

- కరిముల్లా, రాజమండ్రి

రొట్టె వదిలేందుకు వచ్చా...



కొన్నేళ్ల నుంచి మా కుటుంబ సభ్యులు రొట్టెల పండుగకు వస్తున్నారు. గత ఏడాది నేను వివాహ రొట్టె పట్టుకున్నా. పెళ్లి నిశ్చయం అయింది. అందుకే రొట్టె వదిలేందుకు వచ్చా. మా కుటుంబసభ్యులతోపాటు స్నేహితులు కూడా వచ్చారు.

- అబ్బాజాన్, కర్ణాటక రాష్ట్రం

- నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి

50 వేల డోసుల యాంటీ రేబిస్ టీకా సిద్ధం

● జూనోసిస్ వ్యాధులపై అవగాహన అవసరం : జేడీ



జూనోసిస్ డే అవగాహన కరపత్రాలు విడుదల చేస్తున్న పశుసంవర్ధకశాఖ జేడీ రమేష్ నాయక్, డీఎంహెచ్‌వో సుజాత తదితరులు

నెల్లూరు(వ్యవసాయం), జూలై 6(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 50వేల డోసుల యాంటీ రేబిస్ టీకాలను అందుబాటులో ఉంచినట్లు పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కే రమేష్ నాయక్ తెలిపారు. జంతువుల నుంచి సక్రమించే (జూనోసిస్) వ్యాధులపై ప్రతీ ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా నెల్లూరు రైల్వేఫీడర్సురోడ్డులోని పశుసంవర్ధకశాఖ కార్యాలయ ఆవరణలో ఆదివారం జంతు ప్రేమికులు, పాడిరైతులకు జంతువుల నుంచి మనుషుల కు, మనుషుల నుంచి జంతువులకు సంక్రమించే వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జేడీ మాట్లాడుతూ బాగా మరగబెట్టిన పాలను, బాగా ఉడికించిన మాంసాన్ని మాత్రమే తినాలని సూచించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ వీ సుజాత మాట్లాడుతూ జంతు ప్రేమికులు వారి జంతువులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని సూచించారు. పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ టీ సోమయ్య మాట్లాడుతూ వెటర్నరీ పాలీక్లినిక్‌లో ప్రతిరోజూ ఉదయం యాంటీ రేబిస్ టీకాలు ఉచితంగా చేస్తున్నామని, దీనిని పెంపుడు జంతువుల యాజమానులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జూనోసిస్ డే సందర్భంగా ఆదివారం 242 యాంటీ రేబిస్ టీకాలు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో ఖాదర్‌వలి, డాక్టర్ ఎస్ భాస్కర్, పశుసంవర్ధకశాఖ ఏడీలు డాక్టర్ యం మాలకొండయ్య, డాక్టర్ జే చైతన్యకిషోర్, డాక్టర్ జయప్రకాష్, కృష్ణమూర్తి, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సమయమిదే.. స్పందించండి!

- శ్రీశైలం జలాశయంలో 878 అడుగులపైగా నీటిమట్టం
- లక్షన్నర క్యూసెక్కులకుపైగా వస్తున్న వరద
- సోమశిలకు నీటి తరలింపునకు ఇదే అవకాశం
- ఎదురుచూస్తున్న జిల్లా రైతాంగం
- నేడు జిల్లాలో మంత్రులు లోకేష్, ఫరూక్ పర్యటన
- వారితో చర్చిస్తే ముందడుగుకు అవకాశం

నెల్లూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): 2023-24 సంవత్సరంలో పెన్నా క్యాచ్ మెంట్లో ఆశించిన వర్షాలు కురవలేదు. దీంతో సోమశిల, కండలేరు జలాశయాలు డెడ్‌స్టోరేజీకు చేరుకున్నాయి. గతేడాది ఇదే సమయంలో సోమశిల, కండలేరులు డెడ్‌స్టోరేజీకు చేరుకున్నాయి. వీటితోపాటు చెరువులు కూడా దాదాపుగా నిండుకున్నాయి. అంతకుముందు ఏడాది మొదటి సీజన్లో సగం ఆయకట్టు మాత్రమే సాగైంది. ఆ తర్వాత రెండు సీజన్‌లో అసలు సాగే జరగలేదు. ఈ క్రమంలోనే కృష్ణా క్యాచ్‌మెంట్‌లో భారీవర్షాలు కురుస్తూ శ్రీశైలం జలాశయానికి భారీగా వరద వచ్చి చేరింది. నెల్లూరు పరిస్థితిని గమనించిన కూటమి ప్రభుత్వం.. గతేడాది ఆగస్టు 1 నుంచి శ్రీశైలం నుంచి కృష్ణా జలాలను సోమశిలకు విడుదల చేయడం ప్రారంభించింది. సుమారు 60 టీఎంసీల నీటిని సోమశిల, కండలేరుకు తీసుకువచ్చారు. దీంతో ఆ రెండు జలాశయాలు పూర్తిగా నిండాయి. ఫలితంగా పూర్తి ఆయకట్టులో రెండు పంటల సాగు జరిగింది.

● ఇప్పుడు కూడా అవకాశం

శ్రీశైలం పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా, ఆదివారం నాటికి 180 టీఎంసీల నిల్వ దాటింది. ఇన్‌ఫ్లో లక్షన్నర క్యూసెక్కుల వరకూ వస్తోంది. అంటే రోజుకు సుమారు 15 టీఎంసీల వరకు శ్రీశైలానికి చేరుతోంది. జూరాల ప్రాజెక్టు నుంచి మరింత నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో శ్రీశైలానికి ఇన్‌ఫ్లో పెరిగే అవకాశాలున్నాయి. పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుత నీటి మట్టం 878 అడుగులు దాటింది. అయితే 854 అడుగులు మట్టం దాటితే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా సోమశిలకు నీరు విడుదల చేసేందుకు వీలు కలుగుతుంది. ప్రస్తుతం భారీ ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో శ్రీశైలం నుంచి సోమశిలకు నీటిని తెచ్చుకునేందుకు అవకాశం ఏర్పడింది. ఈ సమయంలో జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలంతా కలిసికట్టుగా జిల్లా పరిస్థితులను సీఎం చంద్రబాబుకు వివరించి, శ్రీశైలం నీటిని తీసుకురావాలని రైతాంగం విజ్ఞప్తి చేస్తోంది. ప్రస్తుతం సోమశిలలో 30 టీఎంసీల నీరుంది. ప్రస్తుతం జరుగుతున్న సాగుకు మరో 20 టీఎంసీల వరకూ అవసరమవుతుంది. ఇంకో రెండు నెలల్లో ఈ మొత్తం ఖర్చు చేయాల్సి ఉంది. అలానే కండలేరులో ప్రస్తుతం 31 టీఎంసీలు ఉంది. ప్రస్తుత సాగు, తాగునీటి అవసరాలకు మరో 20 టీఎంసీల వరకూ అవసరమవుతుంది. ఈ క్రమంలో ఇప్పటి నుంచే శ్రీశైలం నుంచి నీటి విడుదల ప్రారంభిస్తే పెన్నా క్యాచ్‌మెంట్లో వర్షాలపై ఆధారపడకుండా రానున్న సీజన్‌లోపు సోమశిల, కండలేరు జలాశయాలను పూర్తిగా నింపేందుకు వీలు కలుగుతుంది. సోమవారం జిల్లాకు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, ఇన్‌చార్జ్ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ వస్తున్నారు. జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు వీరితో కృష్ణా జలాలపై చర్చిస్తే ముందడుగు పడవచ్చు.

మరుపూరులో విషాదం

- తల్లిని కాపాడబోయి తనయుడు మృతి
- విద్యుదాఘాతానికి గురైన తల్లీకొడుకు
- కుమారుడు మృతి, స్పృహ తప్పిన తల్లి



మృతుడు వంశీ (ఫైల్)

పొదలకూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : తల్లికి విద్యుత్ షాక్ తగలడంతో కాపాడే క్రమంలో కొడుకు మృత్యువాత పడిన సంఘటన పొదలకూరు మండలం మరుపూరులో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తల్లి లక్ష్మమ్మ ఇంట్లో పని చేసుకుంటుండగా ప్రమాదశాత్తు వాషింగ్‌మిషన్ వైరు తగిలింది. దీంతో లక్ష్మమ్మ కేకలు వేయడంతో గమనించిన కొడుకు వంశీ తల్లిని కాపాడే క్రమంలో తాను కూడా విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో స్థానికులు హుటాహుటిన వంశీని పొదలకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే మృతి చెందాడు. విద్యుత్ షాక్‌కు గురి కావడంతో లక్ష్మమ్మ స్పృహ తప్పి పడిపోయింది. అయితే ఆమెకు ప్రాణాపాయం తప్పింది. కాగా వంశీకి ఇటీవలే వివాహం జరిగింది. నెలల వయసున్న కుమారుడు ఉన్నట్లు సమాచారం. వంశీ మృతితో కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో మృతదేహంగా అదృశ్యం కేసులోని వ్యక్తి


● నాని మృతికి ఆ నలుగురే కారణం : మృతుడి తల్లి



చెరువులో లభ్యమైన నాని మృతదేహం

బిట్రగుంట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప వాసి ఇరగలదిన్నె నాని (21) శనివారం నుంచి కనిపించడం లేదని, ఆదివారం ఆయన తల్లి శరణ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పోలీసులు ముమ్మర గాలింపు చేపట్టారు. తిప్ప దిగువ, గురుకుల పాఠశాల తదితర ప్రాంతాలతోపాటు అల్లూరు చెరువు లోనూ గాలింపు జరిపారు. ఎట్టకేలకు అల్లూరు చెరువులోని గుర్రపు డెక్క ప్రాంతంలో నాని మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. కప్పరాళ్లతిప్పకు చెందిన సముద్రాల పృథ్వీరాజ్, తమ్మిశెట్టి మదన్, షేక్.సుల్తాన్, టీ.విశాల్ అనే వారు సెల్‌ఫోన్ చోరీ విషయమై తన బిడ్డ నానిని శనివారం మధ్యాహ్నం కారులో తీసుకుపోయినట్లు తల్లి శరణ్య ఫిర్యాదులో పేర్కొన్నారని పోలీసులు తెలిపారు. ఆ నలుగురు ఇప్పటివరకు కనిపించకపోవడంతో వారిపై ఆమె అనుమానం వ్యక్తం చేసినట్లు వారు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు కావలి రూరల్ సీఐ పాపా రావు చెప్పారు. నాని మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న శరణ్య తల్లడిల్లింది. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి, పరారీలో ఉన్న ఆ నలుగురి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు



ఘర్షణలో గాయపడిన మద్దినేని రామస్వామయ్య, పోరుమామిళ్ల హుస్సేనయ్య

సీతారామపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇవ్వవలసిన బాకీ డబ్బులు అడిగినందుకు జరిగిన ఘర్షణలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని పబ్బులేటిపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పబ్బులేటిపల్లి గ్రామానికి చెందిన మద్దినేని రామస్వామయ్య తన సమీప బంధువైన పోరుమామిళ్ల హుస్సేనయ్యకు డబ్బులు అప్పుగా ఇప్పించాడు. ఈ క్రమంలో ఇవ్వాల్సిన డబ్బులు అడగ్గా మాటామాటా పెరిగి ఘర్షణ చోటుచేసుకుంది. ఈఘర్షణలో ఇద్దరికీ గాయాలు కాగా స్థానికులు ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా భక్తులకు ఇబ్బందులు రానివ్వొద్దు

● కలెక్టర్, ఎస్పీ పరిశీలన

నెల్లూరు(క్రైం), జూలై 6 (ఆంధ్రజ్యోతి) : రొట్టెల పండు గకు వచ్చే మహిళా భక్తులకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ కృష్ణకాంత్ ఆదే శించారు. కలెక్టర్ ఓ ఆనంద్, ఎస్పీ ఆదివారం రొట్టెల పండుగ ప్రాంతాన్ని పరిశీలించారు. బందోబస్తు వివరాలు తెలుసుకుని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసిన సీసీ కెమెరాలు, వాటి పనితీరుపై ఆరా తీశారు. దర్గా లోపల క్యూలైన్లలో ఉన్న భక్తులు వీలైనంత త్వరగా దర్శనం చేసుకునేలా చూడాలని ఆదేశించారు. మహిళా భక్తుల కోసం ప్రత్యేకంగా మహిళా కానిస్టేబుళ్లతో బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. తొలి రోజు తప్పిపోయిన 28 మంది చిన్నారులను తల్లిదండ్రుల వద్దకు చేర్చామని, ఒక పిక్ పాకెటర్‌ను అదుపులోకి తీసుకొని ఒక బ్యాగు, ఒక ఏటీఎం కార్డు, ఒక సెల్ ఫోన్‌ను సీసీఎస్ పోలీసులు బాధితులకు అప్పగించారన్నారు. తొలిరోజు 3000 వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించామని తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండిళ్లు దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నెల్లూరు(క్రైం), జూలై 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మద్రాసు బస్టాండు సమీపంలో ఉన్న సరోజిని నగర్‌లో ఆదివారం రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. ఆ ప్రాంతంలో మల్లి చెంచులక్ష్మి, భూమా లక్ష్మి కుటుంబాలు నివసిస్తున్నాయి. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఫైర్ ఇంజన్ వచ్చే సరికే రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని అగ్నిమాపక శాఖ అధికారులు గుర్తించారు.

150 ఏళ్ల బడికి అధునాతన రూపు




ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వీఆర్ హైస్కూల్

నెల్లూరు(విద్య), జూలై 6 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ప్రఖ్యాత వెంకటగిరి రాజాస్ (వీఆర్) ఉన్నత పాఠశాల అధునాతన రూపంతో ముస్తాబైంది. దీనిని సోమవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పునః ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రస్తుత రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం ఏర్పాట్లను మంత్రి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

వీఆర్ విద్యా సంస్థలను 1875లో ప్రారంభించారని, 150 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ పాఠశాల, కళాశాలను వైసీపీ ప్రభుత్వం మూసివేసిందని మంత్రి విమర్శించారు. దీనికి పూర్వ వైభవం కల్పించాలన్న సంకల్పంతో ఎన్సీపీ, నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆధునీకరించామని చెప్పారు. 1050 మంది పేద పిల్లలకు సీట్లు కేటాయించామని, వారికి డిజిటల్ విద్యను అందించనున్నామని తెలిపారు. బడికి దగ్గరగా ఉండే విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు ఇస్తున్నామని, దూరంగా ఉండే వారి రవాణా కోసం 10 బస్సులు కేటాయించామని వివరించారు. ప్రతీ ఒక్కరికి ఆరు జతల యూనిఫాంతోపాటు, ప్రతీరోజూ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ ఉచితంగా అందజేస్తున్నామన్నారు. నెల్లూరు నగరంలో ప్రభుత్వ యాజమాన్యంలోని అన్నీ పాఠశాలలను మరో నాలుగేళ్లలో వీఆర్ హైస్కూల్ తరహాలోనే సిద్ధం చేస్తామని నారాయణ ప్రకటించారు. ఈ క్రమంలోనే డీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రెండు స్కూల్స్‌ను దత్తత తీసుకున్నారని తెలిపారు. ఇప్పటికే సంతపేట మోడల్ స్కూల్ పనులు జరుగుతున్నాయని, వచ్చే విద్యా సంవత్సరం నాటికి 14 హైస్కూల్స్‌ను ఆధునీకరిస్తామని తెలిపారు. కాగా, వీఆర్ హైస్కూల్ అభివృద్ధి పనులను రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మంత్రి నారాయణ కుమార్తె పొంగూరు శరణి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

యాచకుల పిల్లలు బడిలో ఉండాలి...

ప్రాథమిక విద్యకు దూరంగా రోడ్డు పక్కన యాచకులుగా ఉంటూ కాలం గడుపుతున్న చిన్నారులను గుర్తించి పాఠశాలలో చేర్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలని మంత్రి నారాయణ ఆదేశించారు. నగర నియోజకవర్గంలో బడికి వెళ్లకుండా తల్లిదండ్రులతో యాచకవృత్తిని సాగిస్తున్న వారిని సచివాలయ సిబ్బంది గుర్తించి బడిలో చేర్పించాలన్నారు.


స్వాగతం...
సుస్వాగతం...
ఎందరో విద్యార్థిని విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించి
నేడు వీఆర్ హైస్కూల్ పునః ప్రారంభోత్సవానికి విచ్చేయుచున్న రాష్ట్ర విద్యాశాఖామంత్రివర్యులు
గౌ.శ్రీ నారా లోకేష్ గారికి
స్వాగతం... సుస్వాగతం...
నెల్లూరు సిటీ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు

దిక్సూచి

బ్యాంకింగ్ ఉద్యోగాలు

ఎస్‌బీఐలో ప్రొబేషనరీ ఆఫీసర్లు

ఖాళీలు 541

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 541 ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎస్సీ: 80, ఎస్టీ: 73, ఓబీసీ: 135, ఈడబ్ల్యూఎస్: 50, యూఆర్: 203

అర్హత: గ్రాడ్యుయేషన్. ఫైనలియర్ విద్యార్థులూ దరఖాస్తు చేయొచ్చు. అయితే 2025 సెప్టెంబర్ 30వ తేదీలోగా డిగ్రీ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది. మెడిసిన్, ఇంజనీరింగ్, సీఏ తదితర విద్యార్థులూ అర్హులే.

వయస్సు: 2025 ఏప్రిల్ 1 తేదీ నాటికి వయస్సు 21 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్ అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

చివరి తేదీ: 2025 జూలై 14

వెబ్‌సైట్: https://sbi.co.in/

ప్రొబేషనరీ ఆఫీసర్/ మేనేజ్‌మెంట్ ట్రైనీ

ఖాళీలు 5208



ప్రొబేషనరీ ఆఫీసర్లు/ మేనేజ్‌మెంట్ ట్రైనీల కోసం ఐబీపీఎస్ (ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్) నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 11 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో దాదాపు 5208 పోస్టులు ఉన్నాయి.

అర్హత: గ్రాడ్యుయేషన్

వయస్సు: 2025 జూలై 1 తేదీ నాటికి 20 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్ అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

బ్యాంకులు: బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాల కోసం ఈ రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తున్నారు.

చివరి తేదీ: 2025 జూలై 21

వెబ్‌సైట్: https://www.ibps.in/

స్పెషలిస్ట్ ఆఫీసర్లు

ఖాళీలు 1007

పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లో 1007 స్పెషలిస్ట్ ఆఫీసర్ల రిక్రూట్‌మెంట్ కోసం ఐబీపీఎస్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఐబీపీఎస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: పోస్టులను అనుసరించి బీఎస్సీ, బీటెక్, ఎల్ఎల్‌బీ, ఎంఏ, ఎంఆర్క్, ఎంఈ/ఎంటెక్, ఎంబీఏ/పీజీడీఎం, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

వయస్సు: 2025 జూలై 1 తేదీ నాటికి 20 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: 2025 జూలై 21

వెబ్‌సైట్: https://www.ibps.in/

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ జాబ్స్

మల్టీ టాస్కింగ్ స్టాఫ్(నాన్ టెక్నికల్)

పోస్టులు 1075

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ మల్టీ టాస్కింగ్ స్టాఫ్(నాన్ టెక్నికల్), హవల్దార్(సీబీఐసీ అండ్ సీబీఎన్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. 1075 పోస్టులు ఉన్నాయి. పదో తరగతి పాసైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 27 సంవత్సరాల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్లలను అనుసరించి గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. శారీర సామర్థ్యం, రాత పరీక్షల ఆధారంగా ఎంపిక ఉంటుంది.

చివరి తేదీ: 2025 జూలై 24 **వెబ్‌సైట్:** ssc.gov.in

జూనియర్ ఇంజనీర్లు

పోస్టులు 1340

వివిధ డిపార్ట్‌మెంట్లలో ఖాళీగా ఉన్న 1340 జూనియర్ ఇంజనీర్ పోస్టుల భర్తీ కోసం ఎస్ఎస్‌సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంజనీరింగ్ డిప్లొమా, గ్రాడ్యుయేషన్ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఖాళీల్లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రిల్ ఇంజనీర్ల పోస్టులు ఉన్నాయి(డిపార్ట్‌మెంట్ వారీగా ఖాళీల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు). **వయస్సు:** పోస్టులను బట్టి కొన్నింటికి 30, మరికొన్నింటికి 32 సంవత్సరాలు గరిష్ఠ వయోపరిమితి ఉంది. **చివరి తేదీ:** 2025 జూలై 22

వెబ్‌సైట్: ssc.gov.in/

కోర్ బ్రాంచెస్‌లో కీలకం
మెకానికల్ ఇంజనీరింగ్

కోర్ ఇంజనీరింగ్‌లో ప్రధానమైన వాటిలో మెకానికల్ ఒకటి. యాంత్రీకరణతో కలిగిన ప్రయోజనాలు ఎన్నో. మానవ నాగరికతలో అది చెప్పుకోదగ్గ మైలురాయి. యంత్రం ఎలా పనిచేస్తుందో తెలియాలంటే మెకానికల్ ఇంజనీరింగ్‌పై అవగాహన ఉండాలి. ఈ డిసిప్లిన్‌పై అవగాహనకు తోడు అధ్యయనంతో వచ్చే ఉద్యోగాలు, కెరీర్ పరంగా ఎదుగుదల ఎలా ఉంటుందో చూద్దాం.



కదలిక ఉన్న పరికరాల డిజైన్, అభివృద్ధి, ఏర్పాటు, నిర్వహణ, మరమ్మతులు సహా సమస్తం మెకానికల్ ఇంజనీరింగ్ పరిధిలోకి వస్తాయి. రోజువారి జీవితం ఈ సబ్జెక్టుతో ముడిపడి ఉంది. బహుళ అంతస్తుల భవనం మొదలుకుని డ్రైవ్ చేసే వాహనం వరకు మెకానికల్ ఇంజనీరింగ్ ఉనికికి ఉదాహరణలే. ప్రాబ్లమ్ సాల్వింగ్ కూడా ఇందులో భాగం. సైన్స్ మేథ్స్ ఉపయోగించి మెకానికల్ ఇంజనీర్లు పలు సమస్యలకు పరిష్కారాన్ని కనుగొంటారు. ఫీల్డ్‌లో ఎదురయ్యే సమస్యలకు టెక్నాలజీ అడ్వాన్స్‌మెంట్‌తో మంచి పరిష్కారం చూపిస్తారు. అందుకే మెకానికల్ ఇంజనీర్లు బయోమెడికల్, మాన్యుఫాక్చరింగ్, కన్‌స్ట్రక్షన్, ఆటోమేటివ్ రంగాల్లో ఉపాధిని పొందగలుగుతున్నారు.

వివిధ బ్రాంచ్‌లు

మెకానికల్ ఇంజనీరింగ్ పరిధిలోకి పలు బ్రాంచీలు వస్తాయి. ఆడిటివ్ మాన్యుఫాక్చరింగ్, అడ్వాన్స్‌డ్ మెకట్రానిక్స్ అండ్ ఇండస్ట్రియల్ ఆటోమేషన్, ఆటోమేషన్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్, ఆటోమొబైల్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్, ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ ఆటోమేటివ్ టెక్నాలజీ, మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ, మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ అండ్ ఆటోమేషన్ ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ, మెకానికల్ అండ్ ఆటోమేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ అండ్ మెకట్రానిక్స్ ఇంజనీరింగ్(ఆడిటివ్ మాన్యుఫాక్చరింగ్), మెకానికల్ అండ్ రైల్ ఇంజనీరింగ్, మెకానికల్ అండ్ స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్(ఆటోమొబైల్), మెకానికల్ ఇంజనీరింగ్(ఇండస్ట్రీ ఇంటిగ్రేటెడ్), మెకానికల్ ఇంజనీరింగ్(మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్), మెకానికల్ ఇంజనీరింగ్(ప్రొడక్షన్), మెకానికల్ ఇంజనీరింగ్(వెల్డింగ్ టెక్నాలజీ), మెకానికల్ ఇంజనీరింగ్ ఆటోమొబైల్, మెకానికల్ ఇంజనీరింగ్ డిజైన్, మెకట్రానిక్స్ ఇంజనీరింగ్, రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్, ఆటోమేటివ్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ, ఆటోమొబైల్ సర్వీసింగ్ వంటివన్నీ మెకానికల్ ఇంజనీరింగ్ పరిధిలోకే వస్తాయి.

కెరీర్ అవకాశాలు

కన్‌స్ట్రక్షన్ ఇంజనీర్: పెద్ద పెద్ద నిర్మాణాల్లో కూడా మెకానికల్ ఇంజనీర్ అవసరం ఉంటుంది. వెంటిలేషన్, కూలింగ్, హీటింగ్ వంటి పనులు అక్కడ ఉండేవారికి ఎలాంటి అపాయం కలుగని రీతిలో ఉండేందుకు మెకానికల్ ఇంజనీర్ల సూచనలు, సలహాలు అవసరం.

ఆటోమేటివ్ ఇంజనీర్: ఆటోమోటివ్ ఇండస్ట్రీలో వివిధ వాహనాల ఉత్పత్తి, డిజైనింగ్‌లో వీరి సేవలు అవసరం. ఇందులో మళ్ళీ కస్టమర్, మిలిటరీ వాహనాలంటూ ప్రత్యేకంగానూ ఉంటాయి. సురక్షితంగా కొత్త ఫీచర్లు, ప్రత్యామ్నాయ ఇంధనాలు, ఏరోడైనమిక్స్ తదితరాల్లో మెకానికల్ ఇంజనీర్ల పాత్ర ఉంటుంది.

రోబోటిక్ ఇంజనీర్: రోబోటిక్స్ నిర్మాణం, ప్లాన్, నిర్వహణలో పాలుపంచుకోవాలి. డిజైన్, టెక్నాలజీకి తోడు హెల్త్‌కేర్, మెడికల్ డివైజ్‌ల కోసం రోబోట్లను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు.

ప్రాసెస్ ఇంజనీర్: తార్కికంగా ఆలోచించడం, సరికొత్తగా చేయాలన్న ఆలోచన - అమలుపై ఆసక్తి ఉన్న మెకానికల్ ఇంజనీర్లు బీటెక్ తరవాత ప్రాసెస్ ఇంజనీరింగ్‌ను ఎంచుకోవాలి. సంబంధిత విధానాల మెరుగుదలలో ప్రాసెస్ ఇంజనీర్ల పాత్ర ఇతోధికంగా ఉంటుంది. వాటర్ అండ్ పవర్ సప్లయ్, ఫార్మాస్యూటికల్స్, డ్రగ్ మాన్యుఫాక్చరింగ్ ఇండస్ట్రీలో వీరి అవసరం చాలా ఉంటుంది.

మాన్యుఫాక్చరింగ్ ఇంజనీర్: వస్తువుల ఉత్పత్తికి అవసరమైన మెషీన్ల డిజైనింగ్ మాన్యుఫాక్చరింగ్ ఇంజనీర్ పరిధిలోకి వస్తుంది. మెషీన్ విభాగాలు వేటినైనా వీరే రూపొందిస్తారు. అప్లయిన్సెస్ నుంచి ఫుడ్ వరకు వాటికి అవసరమైన పరికరాలను ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది.

ప్రాజెక్ట్ మేనేజర్: వివిధ పనులను ప్రాజెక్టులుగా మలిచి టీమ్‌లను సదరు సంస్థలు నియమిస్తాయి. వారందరితో సక్రమంగా పనిచేయిస్తేనే సదరు ప్రాజెక్ట్ పని పూర్తవుతుంది. ప్రాజెక్టుకు మేనేజర్‌గా అనుభవం బాగా ఉన్న వ్యక్తులను నియమిస్తారు. తమ టీమ్‌లోని సభ్యులతో సమర్థంగా పనిచేయించడమే కాదు, ఫలితాలను రాబట్టే పనిని వీరు చేయాల్సి ఉంటుంది.

సర్వీస్ అండ్ మెయింటెనెన్స్ ఇంజనీర్: కస్టమర్ బిల్డింగ్‌లో వీరుంటారు. యంత్రాలు సమర్థంగా, నిరంతరాయంగా పనిచేసే విషయంలో నిమగ్నమై ఉంటారు. క్లయింట్ విజిట్స్, మెషీన్ల చెకింగ్, పనికిరానివాటిని తొలగించి కొత్తవాటిని ఉంచడం వంటి పనులు ఉంటాయి.

మెటీరియల్స్ ఇంజనీర్: వివిధ యంత్రాల ఉత్పత్తిలో మెటీరియల్ సేకరణ, పరీక్షించడం, మోడిఫై, ఎవాల్యుయేషన్ పనులు ఉంటాయి.

కంట్రోల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీర్: ఫ్యాక్టరీ లేదంటే పనిచేసే చోట పరిశోధన, డిజైన్, డెవలప్‌మెంట్, సిస్టమ్స్ ఇన్‌స్టలేషన్ పనులు ఉంటాయి. మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ పక్కాగా జరిగేలా చూడాల్సిన బాధ్యత వీరిదే.

ప్రొఫెసర్స్, లెక్చరర్స్: మెకానికల్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ, పీహెచ్‌డీ లేదంటే యూజీసీ నెట్/ సీఎస్ఐఆర్ ఎగ్జామ్‌లో క్వాలిఫై అయితే ఇంజనీరింగ్ విద్యా సంస్థల్లో బోధకులుగా రాణించవచ్చు. అంటే అకడమిక్ వాతావరణంలో ఉండొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాలు: యూపీఎస్సీ నిర్వహించే ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామ్ రాసి ఎంపికైతే ఆరంభంలోనే మంచి జీతం, అధికారిక హోదా తద్వారా సక్సెస్‌ఫుల్ కెరీర్‌ను నిర్మించుకోవచ్చు. ప్రభుత్వంలో నీటిపారుదల వ్యవస్థలు మొదలుకుని పలు ఇతర విభాగాల్లో మెకానికల్ ఇంజనీర్లు అవసరమవుతారు.

ఆంత్రప్రెన్యూర్‌షిప్: బాస్‌గా మారడం అన్నమాట. సొంతంగా పైకి ఎదగాలన్న ఆకాంక్ష ఉంటే అందుకు సొంత ఆలోచనలు తోడైతే ఇండిపెండెంట్‌గా యూనిట్ పెట్టుకోవచ్చు. ఒకరి కింద పనిచేయాల్సిన అవసరం ఉండదు. తానే మరికొందరికి ఉపాధి కల్పించవచ్చు.



ప్రొ. ఎన్.వి.రమణారావు
డైరెక్టర్, ఎన్ఐటి రాయపూర్

ప్రయోజనాలు

మనిషి దైనందిన జీవితంతో ముడిపడినది మెకానికల్ ఇంజనీరింగ్. అందులో భాగంగా వివిధ పరిశ్రమల్లో తలెత్తే సమస్యల పరిష్కారంలో మెకానికల్ ఇంజనీర్లు విశిష్ట పాత్రను పోషిస్తారు. మెషీన్స్‌కు సంబంధించి మాన్యుఫాక్చరింగ్, డిజైనింగ్, మెయింటెనెన్స్, అనాలిసిస్ కాన్సెప్టులు బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులో భాగం. ఈ నాలుగేళ్ళ కోర్సు మెకానికల్ ఇంజనీరింగ్‌లో ఉజ్వల కెరీర్‌కు రహదారిని నిర్మిస్తుంది. మేథ్స్ ఫిజిక్స్ ఇంజనీరింగ్ గ్రాఫిక్స్, థియరీ ఆఫ్ మెకానిక్స్, మెషీన్ డ్రాయింగ్, కంప్యూటర్ గ్రాఫిక్స్ తదితరాలు కోర్సులో ఉంటాయి. మాన్యుఫాక్చరింగ్, రీసెర్చ్, డిజైన్ ఎక్విప్‌మెంట్‌కు సంబంధించి నైపుణ్యాల పెంపునకు పై అంశాల అధ్యయనం ఉపయోగపడుతుంది. సంబంధిత నైపుణ్యాలకు పదునుపెట్టుకోవడం ద్వారా మాత్రమే ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం లభిస్తుంది.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

యాక్షన్ థ్రిల్లర్



'సప్త సాగరాలు దాటి' చిత్రంతో చక్కని గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు హేమంత్‌రావు. ఆయన తెరకెక్కిస్తున్న తాజా చిత్రం '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'. ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో డాలీ ధనంజయ కథానాయకుడు. శివరాజ్‌కుమార్ కీలకపాత్ర పోషిస్తున్నారు. వైశాఖ్‌గౌడ్ నిర్మిస్తున్నారు. ఇటీవలే పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ మొదలైంది. ఈ సందర్భంగా డాలీ ధనంజయ లుక్‌ను యూనిట్ విడుదల చేసింది. యాక్షన్‌తో పాటు ప్రేక్షకులను అలరించే అన్ని హంగులతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం, త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం అని మేకర్స్ తెలిపారు. పాన్ ఇండియా కంటెంట్‌తో రూపొందుతున్న చిత్రమిదని దర్శకుడు అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: చరణ్‌రాజ్, సినిమాటోగ్రఫీ: అద్వైత

కంటెంట్ ఉంటేనే కలెక్షన్లు

- ఎస్‌కేఎన్



'ప్రస్తుతం సినిమాల్లో ప్రేక్షకుల్ని మెప్పిస్తున్న ఏకైక అంశం మంచి కంటెంట్ మాత్రమే. సినిమా చిన్నదైనా, పెద్దదైనా ముందు కథ బావుండాలి. ప్రేక్షకుల అభిరుచి మారింది. ఎంత హంగామా చేసినా సినిమాలో కంటెంట్ లేకుంటే థియేటర్లకు రావడం లేదు. మంచి కథతో వచ్చిన సినిమాలే బాక్సాఫీసు దగ్గర నిలబడుతున్నాయి' అని నిర్మాత ఎస్‌కేఎన్ అన్నారు. ఆయన నిర్మిస్తున్న పలు చిత్రాల విశేషాలను ఆదివారం మీడియాతో పంచుకున్నారు.

- నిర్మాతను అవ్వాలని నేను ఇండస్ట్రీకి రాలేదు. అవకాశం వచ్చింది. అందిపుచ్చుకున్నాను. ఇప్పుడు హిందీలోనూ సినిమాలు చేస్తున్నాను. నిర్మాతగా నెగ్గుకు రావడం అంత సులభం కాదు. మన కష్టం అంతా ఒక్కరోజులో పోవచ్చు. పది రూపాయలు పెడితే ఇరవై రూపాయలు వస్తుందని నిర్మాణ రంగంలోకి అడుగుపెడితే నష్టపోతాం. ముందు ఈ రంగం పట్ల మక్కువ ఉండాలి.
- ప్రస్తుతం 'రాజాసాబ్' బ్యాలెన్స్ షూట్ పూర్తి చేసే పనిలో ఉన్నాం. కిరణ్ అబ్బవరంతో 'చెన్నై లవ్‌స్టోరీ' చేస్తున్నా. హిందీలో 'బేబీ' చిత్రం రీమేక్ చేస్తున్నాం. ఆగస్టులో చిత్రీకరణ మొదలుపెడతాం. దర్శకుడు మారుతి, సాయిరాజేశ్‌తో కూడా మా బేనర్‌లో సినిమాలు చేస్తున్నాం. ఇద్దరు కొత్త దర్శకులతో సినిమాలు చేయబోతున్నాం.
- నిర్మాతగా తక్కువ బడ్జెట్‌లో మంచి కథలతో సినిమాలు చేయడం, అవి ప్రేక్షకాదరణ పొందడం నాకు సంతోషాన్నిచ్చింది. ప్రస్తుతం పలు అగ్ర నిర్మాణ సంస్థలతో కలసి సినిమాలు నిర్మిస్తున్నాను. ఇప్పటివరకూ కొందరు తెలుగమ్మాయిలను నా సినిమాల ద్వారా కథానాయికలుగా పరిచయం చేశాను. మరో ముగ్గురు తెలుగమ్మాయిలను పరిచయం చేయబోతున్నా. అలాగే మహిళా దర్శకులతోనూ సినిమాలు చేసేందుకు ప్లాన్ చేస్తున్నా.

తెలుగువారంటే వైల్డ్ ఫైర్

అమెరికాలో టాలీవుడ్ సినీ తారలు సందడి చేశారు. 'నార్త్ అమెరికా తెలుగు సొసైటీ (నాట్స్)- 2025' వేడుకలో దర్శకులు రాఘవేంద్రరావు, సుకుమార్, హీరో అల్లు అర్జున్, హీరోయిన్ శ్రీలీల తదితరులు పాల్గొన్నారు.



తెలుగువారంటే ఫైర్ అనుకున్నారా... వైల్డ్ ఫైర్ అంటూ తన 'పుష్ప' చిత్రంలోని డైలాగ్‌తో ప్రసంగాన్ని ప్రారంభించిన అల్లు అర్జున్ సభికులను అలరించారు. 'ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు ఎంతో సంతోషిస్తున్నా. ఇంతమంది తెలుగువారిని చూస్తుంటే హైదరాబాద్‌లోనో విశాఖపట్నంలోనో ఉన్నట్లు అనిపిస్తోంది. అమెరికాలో మనమంతా ఇలా కలవడం అదృష్టంగా భావిస్తున్నా. నన్ను ఇలాంటి అద్భుతమైన కార్యక్రమానికి ఆహ్వానించినందుకు నాట్స్‌కు ధన్యవాదాలు. నాట్స్ గురించి సరదాగా 'పుష్ప' స్టయిల్‌లో చెప్పాలంటే 'నాట్స్ అంటే నేషనల్ అనుకుంటివా... ఇంటర్నేషనల్'. మన తెలుగు సంస్కృతిని ముందు తరాలకు చేరవేస్తున్నందుకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. భారతీయులు ఎక్కడున్నా తగ్గేదేలే...అందులోనూ తెలుగోళ్లు అస్సలు తగ్గేదేలే. విదేశాల్లోనూ తెలుగువారు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు' అని అల్లు అర్జున్ అన్నారు.

- దర్శకుడు రాఘవేంద్రరావు మాట్లాడుతూ 'నేను పరిచయం చేసిన బన్నీ, శ్రీలీల ఇక్కడ ఉన్నందుకు ఆనందంగా ఉంది. సుకుమార్‌కూ నాకూ ఒక పోలిక ఉంది. అదే గడ్డం. నేను 'అడవి రాముడు'లో అడవిని నమ్ముకున్నా. స్టార్ డైరెక్టర్‌ను అయ్యా. 'పుష్ప'లో అడవిని నమ్ముకున్న సుకుమార్ స్టార్ డైరెక్టర్ అయ్యారు. బన్నీని స్టార్ హీరోను చేశారు. శ్రీలీల సైతం దెబ్బలు పడతాయని అంటూ అందరినీ అలరిస్తోంది' అని అన్నారు.


నాకొక గుర్తింపును ఇచ్చారు

- సమంత



'నేను ఎక్కడికి వెళ్లినా, ఏం చేసినా, ఏ పరిశ్రమలో పనిచేసినా ..తెలుగు ప్రేక్షకులు నన్ను చూసి గర్వపడాలని భావిస్తాను. ఇన్నేళ్ల ప్రయాణంలో నాకు మద్దతుగా నిలిచినందుకు ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటాను. మీరంతా నాకంటూ ఒక గుర్తింపునూ, కుటుంబాన్నీ ఇచ్చారు' అంటూ భావోద్వేగానికి గురయ్యారు నటి సమంత. అమెరికాలో జరుగుతున్న తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) వేడుకల్లో పాల్గొన్నారు సమంత. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ' తానా వేడుకల్లో పాల్గొనడానికి నాకు 15 ఏళ్ల పట్టిందంటే నమ్మలేకపోతున్నా. ప్రతి ఏటా ఇక్కడ జరిగే వేడుకలు, తెలుగువారి గురించి వింటూనే ఉన్నాను. నా తొలి చిత్రం 'ఏ మాయ చేసావే' నుంచి నన్ను మీ మనిషిలా భావించారు. నాపై ప్రేమను చూపించారు. మీ ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు చెప్పడానికి నాకు ఇన్నేళ్లు పట్టింది. కెరీర్ పరంగా ముఖ్యమైన దశలో ఉన్నాను. ట్రాలాలా పేరుతో నిర్మాణ సంస్థను ప్రారంభించాను. నిర్మాతగా 'శుభం'తో తొలి అడుగు వేశా. నార్త్ అమెరికాకు చెందిన తెలుగువారు నా చిత్రాన్ని ఎంతగానో మెచ్చుకున్నారు' అని అన్నారు.

గ్యాంగ్‌స్టర్ డ్రామా



రణ్‌వీర్ సింగ్ హీరోగా తెరకెక్కుతోన్న భారీ చిత్రం 'దురంధర్'. సంజయ్‌దత్, అక్షయ్ ఖన్నా, అర్జున్ రాంపాల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాతో సారా అర్జున్ కథానాయికగా బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు. గతంలో పలు విజయవంతమైన చిత్రాలను అందించిన ఆదిత్య ధర్ ఈ సినిమాకు దర్శకత్వం వహించడంతో పాటు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. డిసెంబరు 5న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ చిత్రం ఫస్ట్‌లుక్, టీజర్‌ని చిత్రబృందం రిలీజ్ చేసింది. ట్రైలర్‌ని చూస్తే ఇదొక గ్యాంగ్‌స్టర్ డ్రామా అని అర్థమవుతోంది. ఇటీవల వచ్చిన 'కిల్', 'జాన్ విక్'లను మించిన యాక్షన్ సన్నివేశాలు ఇందులో ఉన్నాయి.

కొత్తగా..

వినోదం పంచే బకాసుర



నటుడు ప్రవీణ్ ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. వైవా హర్ష టైటిల్ రోల్ పోషిస్తున్నారు. ఈ కామెడీ ఎంటర్‌టైనర్‌తో ఎస్‌జే శివ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా టైటిల్ ర్యాప్‌సాంగ్‌ను దర్శకుడు అనిల్ రావిపూడి చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. ఈ గీతాన్ని వికాస్ బడిస స్వరపరిచారు. ఈ సందర్భంగా ఎస్‌జే శివ మాట్లాడుతూ "బకాసుర రెస్టారెంట్‌లో ప్రతి సన్నివేశం ప్రేక్షకులకు వినోదం పంచడంతో పాటు థ్రిల్‌ను ఇస్తుంది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం" అని చెప్పారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: బాల సరస్వతి, ఎడిటర్: మార్తాండ్ కే. వెంకటేశ్

ప్రేక్షకులను మెప్పించే ప్రేమకథ



సుహాస్ కథానాయకుడిగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'ఓ భామ అయ్యో రామ'. మలయాళ నటి మాళవికా మనోజ్ కథానాయికగా పరిచయమవుతున్నారు. రామ్‌జీ దర్శకుడు. హరీశ్ నల్ల నిర్మిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు హరీశ్ శంకర్ అతిథి పాత్రలో కనిపించనున్నారు. ఈనెల 11న 'ఓ భామ అయ్యోరామ' విడుదలవుతోంది. ఇటీవలె నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'సుహాస్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో తెరకెక్కిన చిత్రమిది. చక్కని ప్రేమకథతో రూపొందించాం. ప్రతి సన్నివేశం ప్రేక్షకులను అలరిస్తుంది. కొత్త అనుభూతిని ఇస్తుంది' అని చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ 'సినిమా మేకింగ్‌లో రాజీ పడలేదు. మంచి అవుట్‌పుట్ వచ్చింది. పాటలు, ఆకట్టుకునే రొమాంటిక్ సన్నివేశాలు, అందరినీ కట్టిపడేసే భావోద్వేగాలు ఈ చిత్రంలో మిళితమై ఉన్నాయి' అని చెప్పారు.

అన్ని హంగులతో అలరించేందుకు



యూత్‌ఫుల్ సబ్జెక్ట్‌తో తెరకెక్కిన చిత్రం వర్జిన్‌బాయ్స్. మిత్రశర్మ, గీతానంద్, శ్రీహాన్, రోనిత్ ప్రధాన తారాగణం. దయానంద్ గడ్డం దర్శకత్వంలో రాజా దారపునేని నిర్మించారు. ఈనెల 11న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సినిమా టికెట్లు కొన్నవారిలో లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసిన 11 మందికి ఐఫోన్లు బహుమతిగా ఇస్తామని చిత్రబృందం తెలిపింది. దర్శకుడు దయానంద్ మాట్లాడుతూ 'నా కళాశాల అనుభవాలను ఆధారంగా చేసుకొని తెరకెక్కించిన చిత్రమిది. 'వర్జిన్‌బాయ్స్' అనే టైటిల్‌కు కచ్చితంగా సరిపోయేలా కథ ఉంటుంది' అని చెప్పారు. రాజా దారపునేని మాట్లాడుతూ 'ఈ సినిమాలో పాపులర్ నటీనటులు ఎవరూ లేరు. కథే ఈ చిత్రానికి హీరో. ప్రేక్షకులను అబ్బురపరిచే కంటెంట్‌తో వస్తున్నాం' అని తెలిపారు. గీతానంద్ మాట్లాడుతూ 'ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లి ఎంటర్‌టైన్ చేస్తుంది. మంచి సినిమా చూసిన ఫీల్‌తో ప్రేక్షకులు థియేటర్ నుంచి వెళ్తారు' అని అన్నారు.

మిస్టీరియస్ కథతో...



పాతతరం నటుడు నాగభూషణం మనవడు అబిద్ భూషణ్ కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'మిస్టీరియస్'. మహి కోమటిరెడ్డి దర్శకత్వంలో ఉషా, శివాని నిర్మించారు. రోహిత్ సహాని కీలకపాత్ర పోషిస్తున్నారు. రియాకపూర్, మేఘనా రాజ్‌పుత్ కథానాయికలు. ఇటీవలె నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా మహి కోమటిరెడ్డి మాట్లాడుతూ 'సస్పెన్స్ జానర్‌లో వస్తున్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా స్ర్కీన్‌ప్లేలో చాలా మార్పులు చేశాం' అన్నారు. భారీ బడ్జెట్, హై టెక్నికల్ వాల్యూస్‌తో గ్రాండియర్‌గా నిర్మించిన చిత్రమిది, భవిష్యత్‌లో మరిన్ని మంచి చిత్రాలతో ప్రేక్షకుల ముందుకొస్తామని నిర్మాతలు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 570

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9332
వెండి కిలో ధర	రూ. 111100
వెండి ఒక గ్రాము	రూ.114.10

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా టీకాలు వేయాలి

వలేటివారిపాలెం, జూలై 6(ఆంధ్రజ్యోతి) : గొర్రెలు, మేకలకు వ్యాధులు ప్రబలకుండా ముదస్తు టీకాలు వేయించుకోవాలని పశువైద్యాధికారి సుదర్శన్ సుధాకర్ వాటి పోషకులకు సూచించారు. మండలంలోని పోకూరులో ఆదివారం గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకుడు సోమినేని తిరు మలరావు, పశువైద్య సిబ్బంది మహిత, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి వేడుకలు



కావలి : గీతామందిరంలో తులసి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

కావలి/కావలిరూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి వేడుకలను ఆదివారం కావలి పట్టణం, మండలంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివార్లను దర్శించుకున్నారు. హిందువుల తొలి పండుగ ప్రతి ఏటా ఆషాఢమాసం శుక్ల పక్ష ఏకాదశి నాడు జరుపుకోవడం ఆనవాయితీ. విష్ణుమూర్తికి అత్యంత ప్రీతి ప్రాయమైన తొలి ఏకాదశి రోజున భక్తులు తెలుత విష్ణుమూర్తిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక రైల్వేరోడ్డులోని గీతా మందిరంలో మహిళలు ప్రత్యేకంగా లక్ష తులసీ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పాల్గొని లక్ష తులసి పూజలు చేస్తున్న మహిళలకు అభివాదం చేస్తూ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. కావలి నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండావాలని వేడుకున్నారు. అలాగే గాలిగంగమ్మ ఆలయంలో జరిగిన అభిషేక కార్యక్రమంలో కూడా ఎమ్మెల్యే పాల్గొన్నారు.

● **అల్లూరు :** మండలంలోని అన్ని ఆలయాల్లో విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయాల్లో ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అల్లూరులోని శివాలయం, వేణుగోపాలస్వామి ఆలయం, పోలేరమ్మ ఆలయం, నార్తుమోపూరులోని శివాలయం, రామాలయం, వరదరాజస్వామి



అల్లూరు గ్రామంలో ఊరేగుతున్న కోదండరాముడు



బిట్రగుంట : స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఆలయంతోపాటు ఇస్కపల్లి శివాలయంలో ప్రత్యేక పూజాభిషేకాలు జరిగాయి. అల్లూరులో వేణుగోపాలుడు గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు.

● **బిట్రగుంట :** బోగోలు మండలంలోని పలు ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు జరిగాయి. కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో వెలసి ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. బోగోలు, చెంచులక్ష్మీ పురం, చెన్నారెడ్డిపాలెం, జక్కేపల్లిగూడూరు, ఎస్‌జీవీ కండ్రిక గ్రామాల్లోని ఆలయాల్లో తొలి ఏకాదశి వేడుకలు నిర్వహించారు.

వైద్యుడు కనిపించే దేవుడు

● **ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి(టౌన్), జూలై 6(ఆంధ్రజ్యోతి): వైద్యుడు కనిపించే దేవుడని ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. డాక్టర్స్ డే పురస్కరించుకుని ఐఎంఏ కావలి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రెడ్‌క్రాస్ రక్తనిధి భవనంలో మహిళలకు రొమ్ము, గర్భకోశ కేన్సర్‌పై అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఒక్కొక్కరికి రూ.5,000 విలువ చేసే కేన్సర్ నిర్ధారణ స్కానింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఐఎంఏ కావలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ కె సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. నెల్లూరు రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రి వైద్యురాలు లక్ష్మి కేన్సర్‌పై అవగాహన కల్పించారు. కాగా ఎమ్మెల్యే ఆమెను సత్కరించగా ఎమ్మెల్యే కుమారై డాక్టర్ వెన్నెల పాల్గొని వైద్య సేవలందించడంతో ఐఎంఏ ఆధ్వర్యంలో ఆమెను సత్కరించారు. ఈ వైద్యశిబిరంలో నారాయణ కేన్సర్ విభాగం వైద్యులలతో పాటు 12 మంది గైనకాలజిస్టులు, 9 మంది రేడియాలిజి స్టులు పాల్గొని సుమారు 250 మంది మహిళల కు కేన్సర్ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైద్యుడు బెజవాడ రవికుమార్, ఐఎంఏ కార్యదర్శి గోపి, సీనియర్ గైనకాలజిస్టులు పద్మజ, నళినిపద్మ, శ్రీరామ్‌మనోహర్ పాల్గొన్నారు.

ఏకలవ్యుడు ఆదర్శంగా గిరిజనులు ఎదగాలి

జయంతి వేడుకలో వక్తలు



కల్లయ్యకు కేక్ తినిపిస్తున్న టీడీపీ నేత కిషోర్

కావలి(టౌన్), జూలై 6(ఆంధ్రజ్యోతి): గిరిజనులు ఏకలవ్య మహారాజ్‌ను ఆదర్శంగా తీసు కుని ఎదగాలని ఏపీ ఎరుకుల గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి కల్లయ్య పే ర్కొన్నారు. ఆదివారం ఏకలవ్యుడు జయంతి వే డుకలు పట్టణ టీకే నగర్‌లోని గిరిజన కాలనీలో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, జిల్లా రైతు నాయకులు బొట్లగుంట శ్రీహరినాయుడు పాల్గొన్నారు. ముందుగా కల్లయ్యచే కేక్‌కట్ చేయించి ఆయనకు తినిపించారు. ఏకలవ్యుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఇటీవల టీడీపీ పట్టణ అధ్యక్ష కార్యదర్శిలుగా ఎన్నికైన కిషోర్, బాబురావులచే కేక్ కట్ చేయించి సత్కరించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ మాల్యాద్రి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల నుంచి మనుషులకు రేబిస్ వ్యాధి

● **పశుసంవర్ధకశాఖ ఏడీ చెన్నకేశవులు**



పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న డాక్టర్ చెన్నకేశవులు

వలేటివారిపాలెం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : రాబిస్ అనే వ్యాధి చాలా ప్రమాదకరమని, అది కుక్కల నుంచి మనుషలకు సంక్రమిస్తుందని వెటర్నరీ ఏడీ డాక్టర్ ఎంతోటి చెన్నకేశవులు చెప్పారు. వలేటివారి పాలెం ఏరియా పశువైద్యశాలలో వరల్డ్ జూనోసిస్ డే సందర్భంగా ఆదివారం పెంపుడు కుక్కలకు టీకాలు వేసి మాట్లాడుతూ పెంపుడు కుక్కలకు ఏడాదికి ఒకసారి ఈ వ్యాక్సిన్ వేయించుకున్నట్లయితే ఈ వ్యాధి నుంచి పెంపుడు కుక్కలతో పాటు మనల్ని మనం రక్షించుకోవచ్చని తెలిపారు. ఈ వ్యాక్సిన్ స్థానిక పశువైద్యశాలలో అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ వ్యాధి పట్ల పెంపుడు కుక్కల యజమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వాసంతి, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ శ్రీలత, సిబ్బంది కిరణ్, రమేష్, శ్రీమాన్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ మనోధైర్యాన్ని పెంచుతుంది

బిట్రగుంట, జూలై 6(ఆంధ్రజ్యోతి): తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ మనోధైర్యాని పెంచుతుందని జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం గంగాధర్‌రావు అన్నారు. బోగోలు మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తైక్వాండో వేసవి శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన విద్యార్థులకు బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో ఆదివారం సర్టిఫికెట్లు అందజేశారు. నెలరోజుల పాటు ఇంటర్‌నేషనల్ మాస్టర్ ఈ.రవిగన్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ నాయకులు బీ.బర్నాడ్, ఎం.శ్రీనివాసులు, ఎం.స్వర్ణ న్‌రాజు, కే.శ్రీనివాసులు, ఎన్.శ్రీనివాసలు యాదవ్, రైల్వే పెన్షనర్స్ కార్యదర్శి గోవిందరాజులు, దాతలు మునీర్, జహీర్ పాల్గొన్నారు.

వైసీపీ రాష్ట్ర సహాయ కదర్యాదర్శిగా ధనకోటి

ఉలవపాడు, జూలై 6(ఆంధ్రజ్యోతి) : వైసీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరిగా ఉలవపాడు అంబేడ్కర్ నగర్‌కు చెందిన వెలిచర్ల ధనకోటిని నియమిస్తూ ఆ పార్టీ అధిష్ఠానం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసిందని ధనకోటి ఒక ప్రకటనలో తెలిపారు. తన సేవలను గుర్తించి రాష్ట్రస్థాయి పదవికి ఎంపిక చేసిన వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి, కందుకూరు వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్, మండల నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

బాబుజగ్జీవన్‌రావుకు ఘన నివాళులు

కావలి(టౌన్), జూలై 6(ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ప్రధాని బాబుజగ్జీవన్‌రావు వర్ధంతి సందర్భంగా ఆదివారం ట్రంకు రోడ్డులోని జగ్జీవన్ రావు విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నేతలు పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విజయమ్మ, కిరణ్, సాల్మన్, మంద రమేష్, శామ్యూల్, శేఖర్, మదన్ పాల్గొన్నారు.

● ముసునూరులోని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన దేశానికి అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీ.కామరాజు, పీ.మాల్యాద్రి, ఏ.మాల్యాద్రి, జీ.ప్రసన్న, కే.కామయ్య, రాజేష్‌లు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రావుకు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

పేద మహిళకు ఆర్థికసాయం

కావలి, జూలై 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాటంరెడ్డి వారివీధికి చెందిన పేద ఆర్యవైశ్య మహిళ పొన్నూరు మహాలక్ష్మమ్మ వైద్యం కొరకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండటంతో ఆమెకు ఆర్యవైశ్య సంఘం నేతలు రూ.40 వేలు ఆర్థికసహాయం అందచేశారు. స్థానిక 33వ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ అమరా వేదగిరి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఆదివారం శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థాన కల్యాణ మండపంలో ఆ నగదును ఆమెకు అందచేశారు. ఈ కార్యక్రమంలో తటవర్తి రమేష్, బలసా ప్రసాద్, చలవాది కిరణ్, గాదంశెట్టి మధుసూదనరావు, మామిడి రామకృష్ణ, చీదెళ్ల కిషోర్, నల్లూరు రమేష్ పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

● **రూ.లక్ష నష్టం**

అల్లూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదంలో 15 ఎకరాల గడ్డివామి దగ్ధమైన ఘటన అల్లూరు పట్టణ పరిధిలోని మారుతీ కాలనీలో శనివారం అర్ధరాత్రి జరిగింది. స్థానిక రైతు పిల్లి నాంచారమ్మ గేదెల కోసం కొనుగోలు చేసుకున్న గడ్డివామికి ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు కావాలనే నిప్పంటించినట్టు బాధితురాలు వాపోయింది. ఒక్కసారిగా మంటలు ఎగసి పడ్డాయి. సమాచారం అందుకు న్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. దీంతో రూ.లక్ష నష్టం వాటిల్లినట్టు బాధితురాలు పేర్కొంది.

అధ్యాపకుడికి ఎన్‌పీటీఈఎల్ బిలీవర్స్ అవార్డు

కందుకూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): కందుకూరు ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఐ.రామకోటేశ్వరరావు ఎన్‌పీటీఈఎల్ బిలీవర్స్ అవార్డును అందుకున్నారు. భారత ప్రభుత్వ మానవవనరుల అభివృద్ధి శాఖ అధీనంలోని ఈ సంస్థ నుంచి రామకోటేశ్వరరావు అవార్డు అందుకోవటం గర్వకారణమని కళాశాల టెక్నికల్ డైరెక్టర్ కె.విజయ్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామకోటేశ్వరరావు నాలుగు ఆన్‌లైన్ టెక్నికల్ కోర్సులు, అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ నెట్‌వర్క్స్, డేటా మైనింగ్, సాఫ్ట్ కంప్యూటింగ్, క్లౌడ్ కంప్యూటింగ్‌లను విజయవంతంగా పూర్తిచేయటం ద్వారా ఈ అవార్డుకు అర్హత సాధించారని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టరు సీహెచ్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ వీ. హరిబాబు, డాక్టరు ఎం.లక్ష్మణరావులు అభినందించారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం

కందుకూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణానికి చెందిన సుల్తాన్‌బాషా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయనకు అత్యవసర వైద్యచికిత్స కోసం ఐఎఫ్‌సీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.20 వేలు ఆర్థికసహాయం అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు షేక్ షంషేర్, సాజిద్, హఫీజ్, ఆయుబ్‌ఖాన్‌పఠాన్, షంషుద్దీన్, షేక్ నాయబ్‌రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు



కామాక్షిదేవికి ఆషాఢ సారెను ఊరేగింపుగా తీసుకొస్తున్న మహిళలు

ఆత్మకూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయం, అలఘనాథస్వామి తదితర ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున నుంచే ఉపవాసాలు ఉండి దేవునికి నైవేద్యాలు సమర్పించి పూజలు చేసి తీర్థప్రసా దాలు స్వీకరించారు.

●**సంగం:** తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకుని సంగమేశ్వరాలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో చండీయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా కామాక్షిదేవి, సంగమేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించారు. కామాక్షిదేవి మూలవిరాట్‌ను శాకాంబరి (కూరగాయలతో) అలంకరించారు. సాయంత్రం మహిళలు పోలేరమ్మ ఆలయం నుంచి ఆషాడ సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి కామాక్షిదేవికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

●**అనంతసాగరం:** మండలంలోని బొమ్మవరం పంచాయతీ చాపురాళ్లపల్లిలో వేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు.

●**ఉదయగిరి:** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని గండిపాళెం, ఉదయగిరి, ఎర్రబల్లిగడ్డ, గుడినరవ, అప్పసముద్రం తదితర గ్రామాల్లోని శివాలయాలు, రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివార్లకు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

10న గురుపౌర్ణమి వేడుకలు

ఆత్మకూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శివాలయ ప్రాంగణం, మెయిన్ బజార్‌లోని సాయిబాబా మందిరాల్లో ఈనెల 10వ తేదీన గురుపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శివాలయ ప్రాంగణంలోని సాయిబాబా మందిరంలో వేకువజామున నుంచే ప్రత్యేక పూజలు, కాగడ హారతి, 7.30 గంటలకు భక్తులతో స్వయంగా అభిషేకం, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు పేర్కొన్నారు.

సోమశిల నీటిమట్టం

అనంతసాగరం జూలై 6 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం 199 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా 30 టీఎంసీలు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 425, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 2,600 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

ఏఎస్ పేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని బరాషాహీద్ దర్గాలో రొట్టెల పండగ సందర్భంగా ఏఎస్ పేట దర్గాకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు దర్గా ఈవో హసానేన్ ఆదివారం తెలిపారు. దర్గాలో దర్శనానికి క్యూ లైన్లు, తాగునీరు, ఉచిత భోజనం తదితర ఏర్పాట్లు చేశామన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

కలువాయి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆదివారం స్థానిక గిరిజన కాలనీలో సుంకర బుజ్జమ్మ పూరిల్లు దగ్ధమైంది. ఇంట్లోని వస్తువులన్నీ బూడిదైపోయాయి. బాధితురాలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు వచ్చి ఇంటిని పరిశీలించారు.

రేపు వైఎస్సార్ జయంతి

వలేటివారిపాలెం, జూలై 6(ఆంధ్రజ్యోతి): స్థానిక వైసీపీ కార్యాలయంలో మంగళవారం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని విజయవంతం చేయాలని వైసీపీ మండల అధ్యక్షుడు అనుమోల లక్ష్మీనరసింహం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఒక్కొక్కటిగా ఎన్నికల హామీలు అమలు : మంత్రి ఆనం

సంగం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలుచేస్తూ వస్తోందని రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మండలంలోని కోలగట్ల గ్రామం ఎస్సీ కాలనీలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. స్థానిక టీడీపీ నాయకులతో కలిసి కాలనీలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందచేసి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఆగస్టు 15 తేదీ నుంచి అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారని తెలిపారు. రూ. 75 కోట్లతో నెల్లూరు జాతీయ రహదారి నుంచి సంగం బ్యారేజ్‌కి అనుసంధాన రోడ్డుకు ప్రతిపాదనలు పంపామన్నారు. వీర్లగుడిపాడు నుంచి నేరుగా సంగం వచ్చేందుకు రూ. 25 కోట్లతో బీరాపేరుపై వంతెన, రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. స్థలం ఉండి కాలనీ ఇళ్లు కావలసిన వారికి కాలనీ ఇళ్లు, స్థలాలు లేనివారికి స్థలాలు ఇచ్చి కాలనీ ఇళ్లు మంజూరుతో పాటు ఒక్కొక్క ఇంటికి రూ. 3.5 లక్షలు కేటాయించనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీలతో పాటు అభివృద్ధి, సంక్షేమ పథకాలన్నింటినీ అమలుచేసే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ మండల, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



కోలగట్లలో కరపత్రాలు పంపిణీ చేసి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి


●**అనంతసాగరం:** ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మండల టీడీపీ అధ్యక్షుడు మెట్టుకూరు కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా బొమ్మవరం, అగ్రహారం, చాపురాళ్లపల్లి గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు వివరించారు. కార్యక్రమంలో సాగరం చెరువు నీటి సంఘం అధ్యక్షుడు రాపూరు సుబ్బారెడ్డి, కాసా పెద్దసూరా రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●**ఉదయగిరి:** మండలంలోని తిరుమలాపురం ఎస్టీ కాలనీలో ఆదివారం టీ డీపీ మండల అధ్యక్షుడు చింతన బోయిన బయన్న ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకోవ డంతో పాటు ఏడాది పాలనపై కరపత్రాలు అంద జేశారు. కార్యక్రమంలో నాయకులు ఆలా రమేష్, బొజ్జా నరసింహులు, ఉప్పుటూరి పెద వెంకటయ్య, నల్లిపోగు నరసిం హులు, మద్దిశెట్టి వెంకటేశ్వర్లు, కొండలరావు, వేమూరి ప్రసాద్, రాగి మాలకొండయ్య, మాధవ, వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

●**ఉదయగిరి రూరల్:** మండలంలోని గం డిపాళెంలో ఆదివారం సుపరిపానలో తొలి అడు గు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఐటీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డిబత్తిన ఉమాసాయిరాం, మాజీ ఎంపీటీసీ అడుసుమల్లి వెంకటేశ్వర్లు, నాయకులు షేక్ ఇమ్రాన్, కిరణ్, కొండలరావు, శ్రీను, వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

●**కందుకూరు:** ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ నేతలు పేర్కొన్నారు. సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని ఆదివారం ఆపార్టీ నేతలు కందుకూరు పట్టణంలోని పలు వార్డుల్లో, మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించారు. యూనిట్ ఇంచార్జిలు, బూత్ ఇంచార్జిలు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ఏడాదికాలంలో తెలుగుదేశం ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. పలుకూరులో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బి.కృష్ణారెడ్డి, నాయకులు గుళ్లా శ్రీనివాసులు, పచ్చవ తిరుపతిస్వామి, బొద్దులూరి కొండలరావు, రావుల రవి, ఈదర సుధాకరరావు, బెల్లం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని నిర్వహించిన కార్యక్రమాలలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు. 8వ వార్డు ఆదిఆంధ్ర కాలనీలో వార్డు అధ్యక్షుడు పర్సు నాగేశ్వరరావు, తదితరుల ఆధ్వర్యంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు.


ఘనంగా దీన్ దయాళ్ జయంతి



దీన్‌దయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఉదయగిరి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జనసంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీన్ దయాళ్ జయంతి వేడుకలను ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

కావలి(టౌన్), జూలై 6(ఆంధ్రజ్యోతి) : డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు ఆదివారం బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ ఉజ్వల భవిష్యత్ కోసం ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నేతలు వింతా రంగారెడ్డి, అమరా సుబ్బారావు, బ్రహ్మానందం, కిరణ్, సీవీసీ సత్యం, లక్ష్మీనారాణ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ఆత్మకూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. 1వ వార్డులో పొట్లూరి జయమ్మ, వడ్డి వెంకటేష్, 3వ వార్డులో షేక్ కరీమున్నీసా, 12వ వార్డులో పి చిన్నమ్మ, 23వ వార్డులో షేక్ ఖాశీంషా, షేక్ ఖాదర్‌బాష, 15వ వార్డులో చంద్రపాటి పెంచలయ్య కుటుంబాలను ఆయన పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.10 వేల వంతున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు కంచి పరమేశ్వరరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు



బోగోలులో పెద్దపీరు ఎత్తుకుని గుండం తొక్కుతున్న భక్తుడు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటలచెరువుపల్లిలో నిర్వహిస్తున్న మొహర్రం వేడుకల్లో భాగంగా ఆదివారం పెద్ద సరిగెత్తు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హక్కుదారులైన దొడ్లా మౌలాలీ నివాసం నుంచి మౌలాలీ స్వామి, అక్బర్‌అలీ పీర్లను ప్రత్యేకంగా అలంకరించి పీర్లు, గంధాన్ని పీర్ల చావిడికి చేర్చారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేపట్టిన ముజావర్లు గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు. భక్తులకు మారెళ్ల రవి అన్నప్రసాద వితరణ చేపట్టారు.

●**ఉదయగిరి:** స్థానిక ఆస్థాన ఖాదరియాలో ఆదివారం మొహర్రం ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత సూఫీ సజ్జాదా నషీన్ కౌన్సిల్ జాతీయ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అహమద్‌బాషా ఖాలీది, జిల్లా మైనార్టీ నాయుకుడు రియాజ్, ఎంపీటీసీ ఎస్థాని మస్తాని, ఖాదరియా ఆస్థాన ముఖ్యులు మిఠాయిగిరి అహమద్, ఫరుద్దీన్, నజీర్ పాల్గొన్నారు.

●**సీతారామపురం:** మండల కేంద్రంతో పాటు తురకపాలెం, ఎగువపాలెం, నారాయణంపేట, పబ్బులేటిపల్లి గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఆదివారం ముగిశాయి. వేకువజామునే పీర్ల గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం అగ్నిగుండాలను మూసివేసి పీర్లను మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆయా గ్రామాల్లోని పీర్ల చావీడుల వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పీర్ల గ్రామోత్సవానికి ఉదయగిరి సీఐ వెంకట్రావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

● **బిట్రగుంట:** బోగోలు మండలంలో మొహర్రం సందర్భంగా ఆదివారం పలుచోట్ల అగ్నిగుండం ప్రవేశం జరిగింది. బోగోలు బజారులోని పీర్ల సావిడి వద్ద తెల్లవారు జామున మౌలాలీ పెద్దపీరుతో పాటు మరో 20 పీర్లను ఎత్తుకుని అగ్నిగుండం తొక్కారు. ఈ కార్యక్రమాన్ని నిర్వాహకుడు షేక్.గౌస్‌బాషా, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పమేరియన్.. బీగిల్.. చౌచౌ




కాకార్‌స్పానియల్, బీగిల్, చౌచౌ, సైంట్ బెర్నర్డ్, లాసాతిప్సో, రోటవీలర్, షిజు, డాల్‌మిషన్, జర్మన్ షెఫర్డ్, లాబ్రడార్ రిట్రైవర్, గోల్డెన్ రిట్రైవర్, బాక్సర్, ఫగ్, పమేరియన్, డాబర్‌మెన్.. ఇలా, అరుదైన శునకాలతో ఆదివారం పశువైద్యశాల ప్రాంగణాలు సందడిగా మారాయి. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు జంతువులకు జిల్లాలో రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. తిరుపతిలో 602 శునకాలు, నాలుగు పిల్లులకు వ్యాక్సిన్ వేశారు.

- తిరుపతిరూరల్, ఆంధ్రజ్యోతి



కాలినడకన తిరుమలకు గోవు

తిరుమల గోవిందుడి సేవకు భక్తులతో కలసి ఓ గోవు కూడా కాలినడకన తిరుమల కొండెక్కడం అందరినీ ఆశ్చర్యపరిచింది. సాధారణంగా అలిపిరి మెట్ల మార్గంలో కాలినడకన వచ్చేందుకు భక్తులు ఆపసోపాలు పడుతుంటారు. ఓ గోవు మాత్రం ఎలాంటి అలసటకు గురికాకుండా ఆదివారం ఉదయం భక్తులందరితో కలిసి కాలినడకన తిరుమల చేరుకుంది. కోట్లాది దైవాలకు స్వరూపంగా ఆరాధించే గోవు గోవిందుడి సన్నిధికి ఇలా కాలినడకన రావడాన్ని చూసిన పలువురు భక్తులు తమ వద్దనున్న పండ్లు పెట్టడంతో పాటు నీరు తాగించి సంతోషం వ్యక్తం చేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఎర్రజెండాకు వందేళ్లు

భారతగడ్డపై 'ఎర్రజెండా'కు వందేళ్లయిన సందర్భంగా ఆదివారం తిరుపతిలో సీపీఐ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. పార్టీ పటిష్టతకు గ్రామ, డివిజన్, మండల, జిల్లా స్థాయిలో సభలు, సమావేశాలు నిర్వహించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. ప్రతి చోట వంద చెట్లు, వంద జెండాలు నాటాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా కొన్ని మొక్కలు నాటారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.

- తిరుపతి(ఆటోనగర్), ఆంధ్రజ్యోతి



సత్యవేడు టీడీపీకి కొత్త సారథి

- కో ఆర్డినేటర్‌గా శంకర్‌రెడ్డిని నేడు శ్రేణులకు పరిచయం చేయనున్న మంత్రి అనగాని
- పార్టీతో ఆదిమూలం అనుబంధం ముగిసినట్టేనా?
- సత్యవేడు రాజకీయాల్లో కొత్త అధ్యాయం మొదలు

తిరుపతి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు టీడీపీ తెర మీదకు హఠాత్తుగా కొత్త పేరు ప్రత్యక్షం కావడం రాజకీయ చర్చకు దారితీసింది. తాజా పరిణామాలు, నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్తగా కేఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత కూరపాటి శంకర్‌రెడ్డిని నియమిస్తున్నట్టు పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. టీడీపీ నుంచి ఎమ్మెల్యే ఆదిమూలంను సస్పెండ్ చేసిన తర్వాత కో ఆర్డినేటర్‌గా శ్రీపతి బాబు, ఎన్నికల నాటి పరిశీలకుడు చంద్రశేఖర్ నాయుడు నియోజకవర్గంలో పార్టీ వ్యవహారాల్లో క్రియాశీలంగా ఉన్నారు. తనపై ఫిర్యాదునే ఉపసంహరించుకున్నందున సస్పెన్షన్‌ను ఎత్తేయాలని ఆదిమూలం కోరినప్పటికీ పార్టీ అధినేత సానుకూలంగా స్పందించలేదు. ఈ దశలోనే పార్టీ కో ఆర్డినేటర్‌గా శంకర్‌రెడ్డిని ప్రకటించారు. ఈ పరిణామం.. ఆదిమూలం పట్ల టీడీపీ వైఖరిని మరింత స్పష్టం చేసినట్లే అని భావిస్తున్నారు.

ఇక కో ఆర్డినేటర్‌గా శంకర్‌రెడ్డిని పార్టీ శ్రేణులకు పరిచయం చేసి, అధినేత ఆదేశాలను వివరించేందుకు సోమవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ సత్యవేడు పర్యటన పెట్టుకున్నారు. ఆదివారం తిరుపతి చేరుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన అనంతరం మధ్యాహ్నానికి సత్యవేడు చేరుకోనున్నారు. అక్కడ తొలుత బేరిశెట్టి కల్యాణ మండపంలో పార్టీ శ్రేణులతో సమావేశం కానున్నారు. ఆ సందర్భంగా శ్రేణులకు కో ఆర్డినేటర్ శంకర్‌రెడ్డిని పరిచయం చేయనున్నారు. ఆపై తొలి అడుగు కార్యక్రమంలో కో ఆర్డినేటర్‌తో పాటు పాల్గొననున్నారు. రాత్రికి సత్యవేడులోనే బస చేసేలా ఆయన పర్యటన షెడ్యూలు ఖరారైంది. దాన్ని బట్టి చూస్తే అటు పార్టీ వర్గాలతో పాటు ఇటు అధికార వర్గాలకు కూడా కో ఆర్డినేటర్‌ను పరిచయం చేసే పరిస్థితి కనిపిస్తోంది. ఇది నియోజకవర్గంలో పార్టీ బాధ్యులు ఎవరనే స్పష్టతనివ్వడానికే అని భావిస్తున్నారు.



రేణిగుంట విమానాశ్రయంలో ఆదివారం మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం

ఏడాదిలోనే మార్పులు

సత్యవేడు నియోజకవర్గ రాజకీయాలు ప్రతి ఐదేళ్లకూ మార్పునకు లోనుకావడం ఆనవాయితీగా వస్తోంది. ఈ పర్యాయం మాత్రం ఎన్నికలు జరిగిన ఏడాదికే రాజకీయ నాయకత్వం తారుమారు కావడం గమనార్హం. ఏడాది కిందట వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న కోనేటి ఆదిమూలం అనూహ్య పరిణామాల నడుమ ఆ పార్టీకి గుడ్‌బై చెప్పాల్సి వచ్చింది. టీడీపీలో చేరి టికెట్ తెచ్చుకుని ఎన్నికల్లో గెలిచారు. అధికార పార్టీ ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో కుదురుకునేలోపే భారీ కుదుపునకు లోనయ్యారు. పార్టీ నుంచీ సస్పెన్షన్‌కు గురై రాజకీయ జీవితంలో సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఆయన సస్పెన్షన్ తర్వాత తొమ్మిది నెలల గడువు దొరికినా ఇతర ఆశావహులు ఆ శూన్యతను సద్వినియోగం చేసుకోలేదు. మాజీ ఎమ్మెల్యే హేమలత గానీ, ఆమె కుమార్తె గానీ, కోఆర్డినేటర్ శ్రీపతి గానీ, పరిశీలకుడు చంద్రశేఖర్ నాయుడు గానీ పరిస్థితులను అనుకూలంగా మలచుకునే ప్రయత్నం చేయలేదని అంటున్నారు. ఆ వ్యవధిలో అధిష్ఠానం అనేక కోణాల్లో కసరత్తు చేసి కేఎస్ఆర్ నిర్మాణ సంస్థ అధినేత కూరపాటి శంకర్‌రెడ్డిని సమన్వయకర్తగా తెర ముందుకు తెచ్చిందని అంటున్నారు. విశేషం ఏమిటంటే.. పార్టీలో అన్ని వర్గాలూ ఆయన రాక పట్ల సానుకూలంగానే వున్నాయి. చివరికి సస్పెన్షన్‌లో వున్న ఎమ్మెల్యే ఆదిమూలం, ఆయన కుమారుడు సుమన్ కూడా శంకర్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. కలసికట్టుగా సత్యవేడును అభివృద్ధి చేస్తామంటూ ప్రకటనలు కూడా ఇచ్చారు. ఈ పరిణామాలు సత్యవేడులో టీడీపీ పటిష్టపడడానికి ఎంతమేరకు దారితీస్తాయో చూడాలి.

వైభవం.. అగ్నిగుండ ప్రవేశం



ద్రౌపదీ దేవికి నిప్పులతో ఒడి కడుతున్న ప్రధాన అర్చకుడు

నిప్పులు తొక్కేందుకు కంకణధారులై వేచి ఉన్న భక్తులు



నిప్పుల్లో పూలచెండు వేసి బయటకు తీశారిలా..

శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధం.. ద్రౌపదీసమేత ధర్మరాజస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం అగ్నిగుండ ప్రవేశ వైభవంగా జరిగింది. ఉదయం దుర్యోధన, దుశ్శాసన వధలో భాగంగా వారి ప్రతిమలు ఏర్పాటు చేసి నాటకాన్ని రక్తి కట్టించారు. సాయంత్రం అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అగ్నిగుండం నుంచి నుంచి నిప్పు కణికలను తీసుకుని ద్రౌపదీ అమ్మవారి ఒడిలో కట్టారు. గుండంలో ప్రధాన అర్చకుడు మల్లెపూల చెండు విసిరారు. ఆ తర్వాత ఆలయం తరపున కలశం, పోతురాజు, గెరికను తీసుకుని అగ్నిగుండం ప్రవేశించారు. వీరి వెంట 4,394 మంది భక్తులు పసుపు దుస్తులు, కంకణాలు ధరించి వేపమండలు చేతబట్టి పూల కిరీటాలు, కళ్లకు కాటుకతో క్యూకట్టారు. గోవింద నామ స్మరణతో అగ్నిగుండంలో నడుస్తూ ఎదురుగా వాహనంపై ఆసీనులైన ద్రౌపదీదేవిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఈసారి మహిళా భక్తులు కూడా విశేషసంఖ్యలో నిప్పులుతొక్కారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



చిన్నారితో కలిసి నిప్పులు తొక్కుతున్న భక్తుడు

కూటమితోనే బీసీల ఆత్మగౌరవం

- ఏదైనా సాధించే వరకు సంఘటితంగా ఉండాలి
- భరోసా సభలో మంత్రుల పిలుపు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 6(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక బీసీలు ఆత్మగౌరవంతో నిలబడ్డారు' అంటూ మంత్రులు పేర్కొన్నారు. తిరుపతిలో ఆదివారం ఏపీ బీసీ సంక్షేమ సంఘం, అంబేడ్కర్- పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన బీసీ ఆత్మగౌరవ భరోసా సభలో వారు మాట్లాడారు. సీఎం చంద్రబాబు బీసీల బీసీల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ వివరించారు. రిజర్వేషన్లు, స్థానిక సంస్థల్లో పాతినిధ్యం తదితర విషయాల్లో బీసీల దామాషా ప్రకారం హక్కులు సాదించాలంటే అందరూ ఐకమత్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఐతే మనం పోరాటం చేయాల్సిన అవసరం లేకుండానే కూటమి ప్రభుత్వం తగిన ప్రాతినిధ్యం కల్పిస్తోందన్నారు. ఏ ప్రభుత్వం కేటాయించనివిధంగా ఉన్నత పదవులు ఇచ్చిందన్నారు. సంఘటితంగా ఉండి మన పోరాట శక్తిని సమాజానికి చాటకపోతే బీసీ ఆత్మగౌరవ సభకు అర్థమే ఉండదని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అభిప్రాయపడ్డారు. పోరాటం ప్రారంభిస్తే సాధించేవరకు విడవనప్పుడే కోరుకున్న ఫలితం వస్తుందన్నారు తమ ఐదేళ్ల అధికారంలో బీసీల బాగోగులను గాలికొదిలి.. దాడులు చేసిన వైసీపీ నేతలు, ఇప్పుడు మళ్లీ న్యాయం చేస్తామంటూ నాటకాలు మొదలు పెట్టారన్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ నాయకత్వంలో బీసీల సంక్షేమం మళ్లీ ప్రారంభమైందన్నారు. ఎన్టీఆర్ చూపిన దిశ, దశలో సీఎం చంద్రబాబు నడుస్తూ బీసీలకు పెద్దపీట వేస్తున్నారని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత చెప్పారు. రంగులరెడ్డి, పెలివెందుల ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రెడ్డి బీసీల ద్రోహి అని అభివర్ణించారు. బీసీల ఓట్లు వేయించుకుని బీసీ భవన్‌లను నర్వీర్యం చేశారని గుర్తు చేశారు. బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. నియోజకవర్గ స్థాయి నుంచి బీసీలకు సముచి స్థానాన్ని కల్పించేందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రాధాన్యమిస్తున్నట్లు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఎస్సీ ఎస్టీలవలే బీసీల రక్షణకు సీఎం చర్యలు తీసుకుంటున్నారన్నారని వివరించారు. ఈ సందర్భంగా ముంత్రులను సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మంత్రి పరసారత్నం, మోహన్, తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, సదాశివ, అనిత, సభాధ్యక్షుడు కల్లూరు నాగరాజగౌడ్, ఆల్‌మన్ రాజు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు కేసర శంకరావు, కాంతికుమార్, జానపద వృత్తి కళాకారుల సంఘం నేత యాదగిరి, పంజాబ్‌కు చెందిన బీసీ సంఘం నేత కుమరన్‌సింగ్, హరియాణా, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.



పంజాబ్ నేత కుమరన్‌సింగ్ తమ ఆచారం ప్రకారం బహూకరించిన కత్తులతో వేదికపై అతిథులు

నేడు అధికారులతో మంత్రి అనగాని సమీక్ష

తిరుపతి(కలెక్టరేట్), జూలై 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర విజన్ 2047, పీ4పై జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం మధ్యాహ్నం 3.30గంటలకు సత్యవేడుకు చేరుకుని సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనున్నారు.

ఈనెలలో రెండుసార్లు గరుడసేవ

తిరుమల, జూలై6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి ఈనెలలో రెండు సార్లు గరుడ వాహనసేవ నిర్వహించనున్నారు. జూలై10న గురుపౌర్ణమి, 29న గరుడ పంచమి సందర్భంగా శ్రీవారి ఉత్సవమూర్తి మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుడుడిపై కొలువుదీరి ఆలయ నాలుగుమాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమివ్వనున్నారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వాహనసేవ జరుగనుంది.

ఈఏపీ సెట్ వెబ్ ఆప్షన్స్ నమోదు తేదీల్లో మార్పు

- 13 నుంచి 18వ తేదీ వరకు ఆప్షన్ల నమోదు

తిరుపతి(విద్య), జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇంజినీరింగ్, ఫార్మా కోర్సుల్లో ప్రవేశాలకుగాను నిర్వహించే ఏపీ ఈఏపీ సెట్-2025 వెబ్ ఆప్షన్ల నమోదు తేదీల్లో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. సోమవారం నుంచి ఈఏపీ సెట్ వెబ్ కౌన్సిలింగ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈనెల 10వ తేదీ నుంచి 18వ తేదీ వరకు విద్యార్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని ముందుగా సాంకేతిక విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. ఐతే వెబ్ ఆప్షన్ల నమోదు ముందుగా ప్రకటించిన ప్రకారం ఈనెల 10వ తేదీ నుంచి కాకుండా 13వ తేదీ నుంచి ప్రారంభమౌతాయని ప్రకటించారు. విద్యార్థులు ఈ అంశాన్ని గుర్తించి ఆయా తేదీల్లోనే వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.



కోట ప్రాంతంలో కనెక్షన్లు తనిఖీ చేస్తున్న డీపీఈ అధికారులు

రైతులు విద్యుత్ అదనపు లోడ్‌ను పెంచుకోండి

తిరుపతి(ఆటోనగర్), జూలై6(ఆంధ్రజ్యోతి): తిరుపతి సర్కిల్ పరిధిలో ఆక్వా చెరువులు నిర్వహిస్తున్న రైతులు తమ విద్యుత్ వినియోగానికి సంబంధించిన లోడ్‌ను పెంచుకోవాలని డీపీఈ విజిలెన్స్ విభాగం ఈఈ గంగాధర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తిరుపతి విద్యుత్ సర్కిల్ కార్యాలయం కేంద్రంగా ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న తనిఖీల్లో భాగంగా శనివారం రాత్రి కోట విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో వాకాడు, చిట్టమూరు సెక్షన్ల పరిధిలో ఆక్వా చెరువుల విద్యుత్ కనెక్షన్లను ఆకస్మికంగా తనిఖీలు చేశామన్నారు. ఆ ప్రాంతంలో అక్రమ విద్యుత్ కన్నెన్లు లేవన్నారు. కొంత మంది రైతులు సర్వీసు తీసుకున్న సమయంలో పొందుపరచిన లోడ్ కంటే అదనంగా విద్యుత్ లోడ్‌ను వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. అదనపు లోడ్ వినియోగిస్తున్న రైతులు అదనపు లోడ్‌కు తగిన మొత్తాన్ని చెల్లించుకోవాలని తెలిపారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకుంటూ అనారోగ్యానికి దూరంగా ఉండాలని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ సూచించారు. ఆదివారం స్థానిక ఏఏరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో వాకర్స్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో కేవీ హస్పిటల్ సహకారంతో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకర్స్‌హెల్త్‌క్లబ్ ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. స్టేడియంలో వసతుల మెరుగుకు కృషిచేస్తున్నానన్నారు. కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, వసంతకుమార్, నారా గోపాల్, శర్మ, వెంకటేశ్వర్లు, సురేష్, ఆరికట్ల మస్తాన్‌నాయుడు, రవి, భాస్కర్, నవీన్ జయకుమార్, డాక్టర్లు కీర్తి, త్రివిక్రమ్, లక్ష్మీనారాయణ, నాగరాజరావు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



గూడూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక కటకరాజవీధిలోని పాండురంగవిఠలనాథస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. రుక్మాభాయి సమేత పాండురంగ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి వైభవంగా రథంపై ఊరేగించారు. భక్తులు రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ



గూడూరు అర్బన్, జూలై 6 (ఆంధ్ర జ్యోతి): స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఆదివారం వైజేపీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బాలింతలకు పౌష్టికాహారం, దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్‌సభ్యులు మాట్లాడుతూ తమ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్‌వీరావు, మురళీకృష్ణ, గోపీనాద్, శ్రీనివాస్, ప్రసాద్, మురళీనాయుడు, మనోజ్‌కుమార్, రాంబాబు, సుజిత పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే టీడీపీ లక్ష్యం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కోట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ముందుకు సాగుతున్నారని టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి వాకా విజయ్‌భాస్కర్‌రెడ్డిలు అన్నారు. చెందోడు, నీలగిరిసంఘం గిరిజనకాలనీ, బీసీ కాలనీలో ఆదివారం టీడీపీ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, పోలయ్య, జితేంద్రరెడ్డి, ధనుంజయ, రమేష్, కోటేశ్వరరావు, సుబ్బయ్య, సాయిరెడ్డి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మొహర్రం



కోట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గోవిందపల్లి, కేశవరం గ్రామాల్లో మూడు రోజుల పాటు జరిగిన మొహర్రం ఆదివారం ముగిశాయి. ప్రజలు భక్తి శ్రద్ధలతో పీర్లను ఎత్తుకుని గుమ్మటాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కేశవరంలో ఆదివారం యువకులు మోడీ, ఉట్టికొట్టే కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహించారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మోటారు సైకిళ్ల ర్యాలీ



సూళ్లూరుపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 9న దేశ వ్యాప్తంగా చేపట్టే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సూళ్లూరుపేటలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆదివారం మోటారు సైకిళ్ల ర్యాలీ చేపట్టారు. స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శిలు రమణయ్య, నాగేంద్ర ఆధ్వర్యంలో మోటారు సైకిళ్ల ర్యాలీ బజారు వీధులగుండా ఆర్టీసీ బస్టాండు వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు వెంకటకృష్ణయ్య, బాలు, రామచంద్రయ్య, చెంచమ్మ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం

ఓజిలి, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో మౌలిక వసతుల కల్పన తొలి ప్రాథామ్యంగా పెట్టుకున్నట్లు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్య తెలిపారు. భువనగిరిపాళెంలో రూ.12 లక్షల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భువనగిరిపాళెంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుతో తాగునీటి సమస్య పరిష్కారమైందన్నారు. ఆర్టీసీ బస్ సౌకర్యంపై ఎమ్మెల్యే విజయశ్రీ దృష్టికి తీసుకువెళ్లి అధికారులతో మాట్లాడతామన్నారు. టీడీపీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్‌నాయుడు, శ్రీనివాసులరెడ్డి, పాడి వెంటసుబ్బయ్య, ఎస్‌కె ఖలీల్, ధనుంజయరెడ్డి ఉన్నారు.

ఘనంగా పీర్ల ఊరేగింపు



నాయుడుపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలో ఆదివారం మొహర్రంను ముస్లింలు, హిందువులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు చిన్నపీర్లచావడి, గరిడి వీధిలో మౌలాలీ తాలం ఖానా, మాలాయకోటలో పీర్ల వద్ద ప్రసాదాలను పంచిపెట్టారు. పంజా ప్రతిష్ఠించి ప్రాంతాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. మాలాయకోటలో పీర్లు ప్రతిష్ఠించిన ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి దాటాక అగ్ని గుండం ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున పీర్లతో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.

హైవే దిగ్బంధం ఘటనలో 15 మందిపై కేసు

పెళ్లకూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : పునబాక రైస్‌మిల్లు గిరిజన కాలనీకి చెందిన అమాస దుర్గ (22) ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో పెళ్లకూరు జాతీయ రహదారిపై శుక్రవారం మృతదేహంతో ఆందోళన చేసిన 15 మందిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. మరికొంత మందిని గుర్తించే పనిలో ఉన్నట్లు సమాచారం. చట్ట విరుద్ధంగా జాతీయ రహదారులపై గుమికూడి వాహనాలను అడ్డుకుని నిరసన కార్యక్రమాలను చేపడితే చర్యలు తప్పవని ఎస్ఐ నాగరాజు స్పష్టం చేశారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళులు



శ్యామ్‌ప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గూడూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆదర్శనీయుడని బీజేపీ పట్టణాధ్యక్షుడు దయాకర్ అన్నారు. ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలన్నారు. అనంతరం చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, శ్రీనివాసరావు, సురేష్‌బాబు, నరేంద్ర, శివ, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ యత్నం సీసీ కెమెరాల ధ్వంసం



గూడలికొండపై పరిశీలిస్తున్న క్లూస్‌టీమ్

కోట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గూడలితిప్పపై పర్వతవర్థిని సమేత భీమేశ్వర ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున చోరీ యత్నం జరిగింది. కొంతమంది తిప్ప మీద జన్మదిన వేడుకలు జరుపుకొని ఆలయ గోడలు దూకి లోపలకు ప్రవేశించారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. గర్భగుడిలోకి వెళ్లి విలువైన వస్తువులు అపహరించేందుకు విఫలయత్నం చేశారు. దీంతో ఆలయం వెలుపల కొన్ని సీసీకెమెరాలను ధ్వంసం చేసి రెండింటిని అపహరించుకువెళ్లారు. ప్రధాన అర్చకుడు ఫిర్యాదుతో ఎస్ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో క్లూస్‌టీమ్ పరిశీలించింది.

విద్యార్థిని విషాదాంతం

● కర్నూలు జిల్లా బనవాసి కళాశాలలో ఆత్మహత్య



మృతి చెందిన రిషిత

ఎమ్మిగనూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి ఏపీఆర్ జేసీలో ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ చదువుతున్న రిషిత (17) ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. కళాశాల అధికారులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం తమ్మినపట్నం గ్రామానికి చెందిన మస్తానయ్య, మంజుల కుమార్తె రిషితకు బైపీసీ గ్రూపులో సీటు వచ్చింది. వారం రోజుల క్రితం రిషిత తల్లిదండ్రులు బనవాసి కళాశాలలో వదిలివెళ్లారు. ఇక్కడ ఉండలేనని రోజూ తల్లిదండ్రులకు ఫోన్ చేస్తుండేది. దీంతో ఆదివారం తల్లిదండ్రులు కళాశాలకు వచ్చి సాయత్రం వరకు రిషితతో గడిపారు. హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేని రిషితమానసిక ఆందోళనకు గురె. రాత్రి 7 గంటల సమయంలో హాస్టల్ బాత్‌రూంలో చున్నీతో ఉరివేసుకుంది. కాసేపటి తర్వాత కళాశాల వర్గాలు గుర్తించాయి. కళాశాల ప్రిన్సిపాల్ సౌజన్యలత సమాచారంతో పోలీసు చేరుకొని బాలికను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వారు నిర్ధారించారు.

క్లూస్ టీమ్ పరిశీలనలో బయటపడిన నగదు

నాయుడుపేటటౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ సెంటర్ సమీపంలో ఓ ఇంట్లో శనివారం చోరీ సంఘటనకు సంబంధించి తిరుపతికి చెందిన క్లూస్ టీం ఆదివారం పరిశీలించింది. బాధిత కుటుంబ సభ్యులు రూ.3లక్షల నగదు, 55 సవర్ల బంగారు ఆభరణాలను దొంగలు తస్కరించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో భాగంగా క్లూస్ టీమ్ వేలిముద్రలు సేకరిస్తుండగా, బీరువాలో రూ.2.50 లక్షల నగదును గుర్తించినట్లు సీఐ బాబి తెలిపారు. దీంతో ఎంత మేర చోరి జరిగిందనే కోణంలో పోలీసుల విచారిస్తున్నారు. ఎస్ఐలు దస్తగిరి, ప్రకాష్‌లు పాల్గొని వేలిముద్రల సేకరించారు.

సర్వదర్శనానికి 13 గంటలు

తిరుమల, జూలై6(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 13 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో భక్తులు నిండిపోయారు. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గోతుల రహదారిలో నిత్యం ఇబ్బందులు



గూడూరు నుంచి విందూరు మార్గమంతా ఇలాంటి గోతులే



ప్రమాదకరంగా వేములపాళెం మలుపు

గూడూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడూరు-మిటాత్మకూరు రహదారి గోతులమయంగా తయారైంది. దీంతో ఈమార్గంలో ప్రయాణించాలంటే ఇబ్బందికరంగా ఉందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. సుమారు 18 కిలోమీటర్ల పరిధి ఉన్న ఈరహదారిలో మిటాత్మకూరు, పగడాలపల్లి, ఈదలపల్లి, సంతదాసుపల్లి, చెంబడిపాళెం, రామలింగాపురం, విందూరు, వేములపాళెం తదితర గ్రామాల ప్రజలు నిత్యం గూడూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. ఆయా గ్రామాల నుంచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఇతర పనులకు వెళ్లే వారికి ఈ గ్రామీణ రహదారి ఆధారం. గూడూరులో పనులు ముగించుకుని రాత్రి సమయంలోగ్రామాలకు చేరుకుంటారు గోతులమయమైన ఈదారిలో రాకపోకలంటే భయపడిపోతున్నారు. రోడ్డు వెంబడి 15 వరకు మలుపులున్నాయి. ఇక్క వద్ద ఎటువంటి వేగనిరోధకాలు, సూచికబోర్డులను లేక పోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. మలుపుల్లో కూడా రోడ్డు గోతులమయంగా మారింది. రాత్రి సమయంలో గుంతలు కనిపించక వాహనచోదకులు పడిపోతున్నారు. మూడురోజుల క్రితం విందూరు సమీపంలో ఆటో బోల్తాపడడంతో ఓ వృద్ధుడు మృతిచెందాడు. అధికారులు స్పందించి రహదారిని అభివృద్ధిపరచాలని కోరుతున్నారు.

సార్వత్రిక సమ్మె జయప్రదానికి వామపక్షాల పిలుపు



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుబ్రమణ్యం

గూడూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభాకర్, డీపీ పోలయ్య, సీవీఆర్‌కుమార్, శశికుమార్, నారాయణ, సునీల్, యాకోబు, చెంగల్‌రావు తదితరులు పాల్గొన్నారు. **గూడూరు అర్బన్:** కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్‌కోడ్‌లు కార్మిక వర్గానికి మరణశాసనంలాంటివని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో శివకుమార్, బీవీరమణయ్య, మణి, ఇంద్రావతి, ప్రభావతి, సుబ్బయ్య, రామయ్య, ప్రసాద్, మధు, ముత్యాలయ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం పూజలు చేశారు. పలు ప్రాంతాల భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు తయారుచేసి అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక అలంకారంలో ఉన్న ముత్యాలమ్మను దర్శించుకున్నారు. త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

అట్రాసిటి కేసుపై విచారణ



దుకాణదారులను విచారిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

పెళ్లకూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : పెళ్లకూరు పీహెచ్‌సీ సమీపంలో యాగాన్ని బెన్నీ అనే దళితుడుపై జరిగిన దాడి కేసు విషయంలో అట్రాసిటీ కేసుపై ఆదివారం నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు విచారణ చేపట్టారు. పలువురు దుకాణదారులను విచారించి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. ఎస్ఐ నాగరాజు ఉన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి: కురుగొండ్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, జులై 6 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. పట్టణంలోని 20వ వార్డులో ఆదివారం సుపరిపాలనతో తొలి అడుగు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాటాడారు. సోమశిల-స్వర్ణముఖి లింకు కెనాల్ నిర్మాణం ప్రారంభానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. పారిశుధ్యం గురించి పట్టించుకోవాలని ఆప్రాంత వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. మున్సిపల్ కమిషనరును పిలిపించి పారిశుధ్యంపై శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. నేతలు గంగోటి నాగేశ్వరరావు, పులికొల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, గంగాధర్, సత్యనారాయణ ఉన్నారు. **బాలాయపల్లి:** ప్రతి కార్యకర్త బాధ్యతగా పని చేయాలని ఎమ్మెల్యే కురుగిండ్ల రామకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని కడగుంటలో సుపరిపాలనలో తొలి అగుడు కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికి తిరిగారు .ఏడాదిపాలనలో చేపట్టిన అభివృది పనులు, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కడగుంట లో రూ.62 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అంకయ్య, మండలపార్టీ అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, జన్నిరమణయ్య గంగోటి నాగేశ్వరావు, రాయి సత్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాదశి పూజలు

గూడూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తొలిఏకాదశి సందర్భంగా స్థానిక బ్రాహ్మణసేవా సంఘ సమాఖ్య భవనంలో ఆదివారం సమాఖ్య ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతపూజలను నిర్వహించారు. ఆధ్యాత్మిక ఉపన్యాసకులు శిరోమణిశర్మ సహకారంతో వ్రతపూజలు నిర్వహించి వ్రత శిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ రోహిణి, ఆనిమెళ్ల శివకుమార్, రామ్మూర్తి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కోట: గూడలిలోని జనార్దనస్వామి ఆలయంలో ఆదివారం తొలిఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. ప్రధాన అర్చకుడు ఉదయగిరి ఆదిశేషాచార్యుల ఆధ్వర్యంలో జనార్ధనస్వామి విగ్రహానికి పలు అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. గూడలితోపాటు పరిసర గ్రామాల భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రైతులు స్వర్ణముఖినదిలో పంటల కోసం పూజలు చేశారు

సూళ్లూరుపేట: స్థానిక పార్కువీధిలోని మద్వేంకట రామ్మూర్తి స్వామి ఆలయం, షార్ బస్టాండు వద్ద ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం చేసి స్వామివారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

నెర్రికాలువపై లాక్‌ల రిపేర్లతో కడగండ్లు



వరదల సమయంలో కొట్టుకుపోయిన లాక్

దొరవారిసత్రం, జూలై6(ఆంధ్రజ్యోతి): టపాయిండ్లు వద్ద నెర్రికాలువపై లాక్‌లు మరమ్మతులకు గురయ్యాయి. లింగంపాడు చెరువుకు నెర్రికాలువ నీటిని మళ్లించాలంటే కాలువపై లాక్‌లను మూసివేయాల్సి ఉంటుంది. నాలుగు లాక్‌ల్లో ఒకటి పూర్తిగా వరదల సమయంలో కొట్టుకుపోయింది. మిగిలిన మూడు మరమ్మతులకు గురై తెరుచుకోవడంలేదు. వరదొస్తే నీరు లింగంపాడు చెరువుపైబడి దిగువ గ్రామాల్లోకి వెళుతుంది. సాగు నీటి కోసం రైతులు లాక్‌ల వద్ద ఆనకట్టలను కట్టుకోవాల్సి వస్తోంది. ప్రస్తుతం తెలుగుగంగ నీరు వస్తున్నా చెరువులకు మళ్లించడానికి రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి లాక్‌లకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. పూర్తిగా లేని గేట్‌లో లాక్‌ను ఏర్పాటు చేయాలంటున్నారు.

గూడూరులో మంత్రి లోకేశ్‌కు ఘన స్వాగతం







గూడూరులో కరచాలనం చేస్తున్న మంత్రి లోకేశ్- రేణిగుంట విమానాశ్రయం వద్ద లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు విజయశ్రీ(సూళ్లూరుపేట), కురుగొండ్ల రామకృష్ణ(వెంకటగిరి)

గూడూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు పర్యటనకు వెళ్తున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఆదివారం రాత్రి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. రేణిగుంట విమానాశ్రయం నుంచి ఆయన నెల్లూరుకు రోడ్డు మార్గంలో బయలుదేరారు. గూడూరులోని జాతీయ రహదారి పోటుపాళెం కూడలి వద్ద మంత్రికి పెద్దఎత్తున నాయకులు, స్వాగతం పలికారు. కారులో నుంచి పలువురు నాయకులకు, కార్యకర్తలతో ఆయన కరచాలం చేశారు. ఆప్యాయంగా పలకరించారు. నాయకులు నానాజీ, కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదివారం వస్తే ఇక్కడి సంతతో అవస్థలే

● మన్నారుపోలూరు ప్రధాన రహదారిలో ట్రాఫిక్ చిక్కులు

సూళ్లూరుపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మన్నారుపోలూరు జంక్షన్ ప్రధాన రోడ్డులో ఆదివారం సంతలో వాహన రాకపోకలతో పాటు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి ఆదివారం తమిళనాడు, చిత్తూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చి వ్యాపారులు వచ్చి సంత పెడుతున్నారు. రోడ్డు పక్కన ఇరువైపులా సంతలో అరకిలో మీటరు మేర వాహనాలు నిలిపి కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులు కూడా వస్తువులను రోడ్డుపైనే ఉంచుతున్నారు. కొనుగోలు దారులతో రోడ్డు కిక్కిరిసిపోతోంది. మోటారు సైకిల్, పాదచారులు వెళ్లలేని పరిస్థితి. తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో మన్నారుపోలూరు విస్తరించింది. టిడ్కో ఇళ్ల సముదాయం, ఎన్టీఆర్ నివాసం కేంద్రం ఇళ్లు కూడా ఆ ప్రాంతంలోనే ఉన్నాయి.

తిరుపతి-తిరుమల, శ్రీకాళహస్తిలకు పడమటి పల్లెలక ప్రజలు కూడా ఈ రోడ్డు గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. జిల్లా కేంద్రానికి వెళ్లే ఆర్టీసీ బస్సులు. కంపెనీలకు వెళ్లే వాహనాలకూ ఇదే మార్గం. ప్రధాన రోడ్డులోనే కాకుండా అలఘుమల్లారి కృష్ణస్వామి ఆలయ రోడ్డులో కూడా సంత పెట్టడంతో స్థానికులకు ఇబ్బంది కలుగుతోంది. మున్సిపాలిటీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. మున్సిపాలిటీ అధికారులు, పోలీసులు స్పందించి సంతను మరో చోట ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ఆదివారం సంత జరుగుతున్నప్పుడు ఎదురెదురు వాహనాలు తప్పించుకోవాలంటే కష్టమే..!